

ప్రొద్దుటూరులో కుంభవృష్టి

● జలమయమైన రోడ్లు ● పొంగిపొర్లిన కాలువలు



శివాలయం రోడ్డు నుంచి శ్రీనివాసనగర్ సర్కిల్లో నిలిచిన నీళ్లు

ప్రొద్దుటూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరులో బుధవారం రాత్రి కుంభవృష్టి కురిసింది. కాలువలన్నీ పొంగిపొర్లాయి. దీంతో పట్టణంలోని ప్రధాన రోడ్లతో పాటు అనేక ప్రాంతాలు జలమయమయ్యాయి. రెండు గంటల్లో 120 మి.మీ వర్షం కురిసింది. ఇలాంటి వాన మరికొన్ని గంటలు కురిస్తే ప్రొద్దుటూరులో అనేక ప్రాంతాల్లో ఇళ్లు మునిగి పోయేవి. ఇటీవల ప్రధాన కాలువల్లో పూడికను రూ.1.25 కోట్లతో తొలగించినా.. తిరిగి కాలువల్లో మురుగు పారక వర్షం నీటితో కలిసి రోడ్లపైకి వచ్చేసింది. ప్రత్యేకించి మురికివాడల్లోని ఇళ్లలోకి నీళ్లు వచ్చి ఇబ్బందులు పడుతున్నామని కమిషనర్‌కు బాధితులు గోడు వెలిబుచ్చారు. ఇప్పటికే రెవెన్యూ కార్యాలయం, విద్యుత్ కార్యాలయం, మార్కెట్, ఎగ్జిబిషన్ మైదానం ప్రాంతాలన్నీ జలమయం అయ్యాయి. పట్టణంలో రోడ్లపైకి నీరు రాకుండా అడ్డంకులు తొలగించే పనులను మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నూర్‌బాషా, సుబ్బరాయుడు, సునీత పర్యవేక్షించారు.



పొంగి పారుతున్న మడూరు కాలువ



ప్రొద్దుటూరు కూరగాయల మార్కెట్‌లో వర్షపు నీరు

జమ్మలమడుగు డివిజన్‌లో వర్షపాతం

జమ్మలమడుగు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు రెవెన్యూ డివిజన్‌లో బుధవారం రాత్రి భారీ వర్షం కురిసింది. అత్యధికంగా ఎర్రగుంట్లలో 132 మి.మీ వర్షపాతం నమోదు అయింది. ప్రొద్దుటూరులో 120.2 మి.మీ, పెద్దముడియంలో 80.8, రాజుపాళెంలో 83.2, ముద్దనూరులో 43.2, దువ్వూరులో 34.6, జమ్మలమడుగులో 30.2, చాపాడులో 8.6, కొండాపురంలో 3.8, మైలవరంలో 7.4 మిమీ వర్షపాతం నమోదు అయినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

లబోదిబోమంటున్న రైతన్నలు

రాజుపాలెం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాజుపాలెం మండలంలో బుధవారం రాత్రి 83.2 మి.మీ వర్షం కురవడంతో పంటపొలాలు నీటమునిగి రైతులు లబోదిబోమంటున్నారు. గురువారం ఉదయం నుంచి రాజుపాలెం - వెంగలాయపల్లె, రాజుపాలెం - టంగుటూరు, తొండల దిన్నె - టంగుటూరు గ్రామాల్లో మడమ వంక ఉధృతితో రాకపోకలు బంద్ అయ్యాయి. ఈ మడమ వంక ఇరుపక్కలా ఉన్న వరి పొలాలు నీట మునిగాయి.



వంక ఉధృతంగా ప్రవహిస్తుండడంతో నీట మునిగిన వరిపంట

దంచి కొట్టిన వాన

కడప కలెక్టరేట్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా బుధవారం రాత్రి భారీ వర్షం కురిసింది. నాలుగు రెవెన్యూ డివిజన్లలోనూ కుంభవృష్టి కురిసింది. అయితే 36 మండలాల పరిధిలో 35 మండలాల్లో వర్షం కురవగా, కలసపాడు మండలంలో చుక్క వర్షం నమోదు కాకపోవడం గమనార్హం. జిల్లా వ్యాప్తంగా బుధవారం రాత్రి 1582 మిల్లీమీటర్ల వర్షం నమోదు అయింది. అత్యధికంగా జమ్మలమడుగు డివిజన్‌లోని యర్రగుంట్ల మండలంలో 132 మి.మీ నమోదుకాగా ప్రొద్దుటూరులో 120.2 మి.మీ నమోదయింది. కడప రెవెన్యూ డివిజన్‌లోని చింతకొమ్మిదిన్నె మండలంలో 110.4 మి.మీ వర్షం నమోదు అయింది. పులివెందుల డివిజన్‌లోని మండలాల్లో 12.4 మి.మీ నుంచి 77 మి.మీ వరకు వర్షం కురిసింది. ఈ డివిజన్‌లో మొత్తం 331.2 మి.మీ వర్షపాతం నమోదయింది. జమ్మలమడుగు డివిజన్‌లో 544.2 మి.మీ, కడప డివిజన్‌లో అత్యధికంగా 632.6 మి.మీ, బద్వేలు డివిజన్‌లో అత్యల్పంగా 74 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది.

పోట్లదుర్తిలో రోడ్డు పైకి..

ఎర్రగుంట్ల సెప్టెంబరు18(ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్లలో గురువారం తెల్లవారుజామున కుండపోత వర్షం కురిసింది. కేవలం నాలుగు గంటల్లో 132 మి.మీ వర్షం నమోదయింది. గత ఐదేళ్లలో ఇది రికార్డు వర్షం. ఈ భారీ వర్షంతో ఎర్రగుంట్లలో వీధులన్నీ జలమయం అయ్యాయి. ఎర్రగుంట్ల నుంచి పోట్లదుర్తి మార్గంలో ప్రధాన రహదారిపైకి నీళ్లు రావడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.



పోట్లదుర్తి వద్ద రోడ్డుపై నీరు రావడంతో ఆగిపోయిన వాహనాలు

● అసెంబ్లీలో.. మనవాణి

కిలో రూ.12తో ఉల్లి కొనుగోలు చేయాలి

● ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి



కమలాపురం రూరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కమలాపురం నియోజకవర్గంలో రైతులు పండించిన ఉల్లిని సీఎం చంద్రబాబు ప్రకటించిన విధంగా కిలో రూ.12తో రైతుల నుంచి కొనుగోలు చేయాలని కమలాపురం ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి కోరారు. గురువారం అసెంబ్లీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కమలాపురంలో ఉల్లి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశారే కానీ ఇక్కడ కొనుగోళ్లలో జాప్యం జరుగుతోందన్నారు. దీని వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని, సత్వరమే పంట కొనుగోలుకు ఆదేశాలివ్వాలని సభ దృష్టికి తీసుకువచ్చారు. కమలాపురం నియోజకవర్గంలో వీరపునాయునిపల్లె, పెండ్లిమర్రి మండలాల్లో అధిక శాతం రైతులు ఉల్లి పంట వేశారని ప్రస్తుతం ఉల్లి పంట అమ్ముకోలేక నిల్వ చేసుకోలేక ఇబ్బంది పడుతున్నారని అన్నారు. అదేవిధంగా అకాల వర్షాలతో ఇబ్బంది పడుతున్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరారు.

హామీలకు నిధులు మంజూరు చేయాలి

● ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్



మైదుకూరు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మైదుకూరు ప్రజల సమక్షంలో ఇచ్చిన హామీలకు నిధులను మంజూరు చేయించాలని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ కోరారు. ఆయన అసెంబ్లీ సమావేశాలలో గురువారం మాట్లాడుతూ సీఎం చంద్రబాబు మైదుకూరు పర్యటనలో భాగంగా సీసీ రోడ్లు, డ్రైనేజీలకు సుమారు రూ.2కోట్లు మంజూరు చేశారని, ఆ నిధులను వెంటనే ఇచ్చి పనులు జరిగేలా చూడాలని ఎమ్మెల్యే కోరారు. మైదుకూరు మున్సిపాలిటీకి సురక్షిత మంచినీరు అందించేందుకు అమృత్ పథకం పేరుతో 2015లోనే రూ.89 కోట్లతో పైపు లైను వేశారని అయితే ఆ పైపు లైన్ ఎక్కడుంతో తెలీడం లేదన్నారు. రూ.99 కోట్లతో చేపట్టిన అమృత్ పథకం పనులు పూర్తిచేయించి మున్సిపాలిటీకి మంచినీటి కొరత లేకుండా చేయాలని కోరారు. అందుకు పురపాలక శాఖ మంత్రి స్పందించి నిధుల మంజూరుకు కృషి చేస్తామని తెలిపారు.

రాజోలి రిజర్వాయర్ రైతులను ఆదుకోండి



● ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి

పులివెందుల, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు నియోజకవర్గంలోని పెద్దముడియం మండలంలో రాజోలి రిజర్వాయర్ పరిధి రైతులను ఆదుకోవాలని శాసన మండలిలో ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి కోరారు. గురువారం శాసనమండలిలో రామగోపాల్‌రెడ్డి రాజోలి రిజర్వాయర్ పై మాట్లాడారు. 2002లో రాజోలి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మించాలని అప్పటి ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. అందుకోసం 10వేల ఎకరాలు ప్రభుత్వం సేకరించిందన్నారు. కానీ ఈ భూములకు సంబంధించి రైతులకు ఒక్క నయాపైసా కూడా చెల్లించలేదన్నారు. నష్టపరిహారం చెల్లించకముందే ప్రభుత్వ రికార్డుల్లో ప్రభుత్వ భూముల కింద చేర్చారన్నారు. దీనితో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ పదివేల ఎకరాలకు సంబంధించిన రైతులకు న్యాయం చేయాలని కోరారు. ప్రభుత్వం వీరికి పరిహారం చెల్లించాలి, లేదంటే వారి భూములను రికార్డుల్లో మార్పులు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

8.5 తులాల బంగారం చోరీ



బాధితురాలితో మాట్లాడుతున్న ఎస్ఐ తిరుపాల్‌నాయక్

వేంపల్లె, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె పట్టణం గండిరోడ్డులోని పిల్లస్వామిగుట్ట సమీపం లో ఉన్న జగనన్న కాలనీలో నివాసముం టున్న నాగేంద్ర, వాణిల ఇంట్లో చోరీ జరిగింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో తలుపులు తీసి బీరువాను పగుల గొట్టి అందులో ఉన్న 8.50తులాల బంగారం, రూ.15వేల నగదు దోచుకెళ్లారు. యురేనియంలో నాగేంద్ర పనిచేస్తుండగా, ఆయన భార్య వాణి ప్రైవేటు స్కూల్లో పనిచేస్తున్నారు. రోజు మాదిరిగానే గురువారం ఇద్దరూ విధులకు వెళ్లారు. విధులు ముగించుకుని ఇంటికి వచ్చేప్పటికి గుర్తుతెలియని వ్యక్తులు తాళాలు పగులగొట్టి ఇంట్లో ఉన్న బంగారు, నగదు తీసుకెళ్లినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్ఐ తిరుపాల్‌నాయక్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అత్యాచార నిందితుడికి పదేళ్ల జైలు శిక్ష

వేంపల్లె, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె పట్టణం శ్రీరామ్‌నగర్‌కు చెందిన తమ్మిశెట్టి రామాంజనేయులు అనే వ్యక్తి బాలికపై అత్యాచారం చేసిన కేసు నిరూపణ కావడంతో కడప పోక్సో కోర్టు ఇన్‌చార్జి జడ్జి యామిని ముద్దాయికి పదేళ్ల జైలుశిక్ష, రూ.3వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారని సీఐ నరసింహులు తెలిపారు. 2019 ఆగస్టు 26వ తేదీన రాత్రి బాలికపై నిందితుడు అత్యాచారం చేసినట్లు పోలీసులకు ఫిర్యాదు రాగా కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి విచారణ నిర్వహించగా నిందితుడు అత్యాచారం చేసినట్లు పోలీసులు రుజువుచేయడంతో జడ్జి జైలుశిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారు. కేసులో చురుగ్గా పనిచేసిన పోలీసులను, అధికారులను ఎస్పీ అభినందించారు.

యూరియా కొరత లేదు

● కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి



చింతకుంటలో యూరియా నిల్వలను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

దువ్వూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): యూరియా కొరత లేదని, రైతులు ఆందోళన పడాల్సిన అవసరం లేదని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అన్నారు. దువ్వూరు మండలం చింతకుంటలో గురువారం యూరియా పంపిణీని వ్యవసాయ శాఖ జిల్లా అధికారి చంద్రానాయక్‌తో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం గ్రామ సచివాలయంలో రైతులతో సమావేశం అయ్యారు. క్షేత్రస్థాయిలో యూరియా పంపిణీ ఎలా జరుగుతోందని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. వచ్చిన యూరియా సరిపోతుందా లేదా అని అడిగారు. మోతాదుకు మించి వాడవద్దని సూచించారు. అధిక వాడకంతో ప్రయోజనం ఉండదని తెలిపారు. కార్యక్రమంలో ఉద్యానవన జిల్లా సంయుక్త వ్యవసాయ సంచాలకులు రవీంద్రబాబు, మైదుకూరు ఏడీఏ కృష్ణమూర్తి, తహశీల్దారు సంజీవరెడ్డి, వ్యవసాయాధికారి అమర్‌నాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లాటరీ ద్వారా 7 బార్ల ఎంపిక : జేసీ



బార్లకు లాటరీ తీస్తున్న జేసీ అదితిసింగ్

కడప కలెక్టరేట్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రీ నోటిఫికేషన్ ప్రకారం 14 బార్లకు గానూ 8 బార్లకు దరఖాస్తులు అందాయని అందులో 7 బార్లకు అర్హత మేరకు లాటరీలో ఎంపిక చేశామని జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో బార్లకు సంబంధించి లాటరీ జరిగిందన్నారు. ఈ సందర్భంగా పారదర్శకంగా నిర్వహించిన లాటరీలో ఏడుగురు లబ్ధిదారులకు బార్లను కేటాయించామన్నారు. కడపలో 4, పులివెందుల 1, మైదుకూరు 1, బద్వేలు1 బార్లను కేటాయించామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి రవికుమార్, అసిస్టెంట్ కమిషనర్ వి.చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

టాస్క్‌ఫోర్స్ పోలీసుల అదుపులో 18 మంది ఎర్రచందనం స్మగ్లర్లు

ప్రొద్దుటూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు సమీపంలోని పెద్దశెట్టి పల్లె గ్రామం వద్ద తమిళనాడుకు చెందిన ఎర్రచందనం స్మగ్లర్లు, కూలీలను దాదాపు 18 మందిని కడప ఎర్రచందనం స్పెషల్ టాస్క్ ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. గురువారం రాత్రి 8గంటల సమయంలో తమిళనాడుకు చెందిన ఎర్రచందనం కూలీలను రెండు వాహనాల్లో కర్ణాటక బళ్లారిమీదుగా ఏపీలోని కోవెలకుంట జమ్మలమడుగు నుంచి ప్రొద్దుటూరు మీదుగా తీసుకెళుతుండగా స్పెషల్ టాస్క్ ఫోర్స్ నిఘా పెట్టి వారిని ఫాలో అవుతూ పెద్దశెట్టిపల్లె వద్ద పట్టుకున్నారు. వాహనాల అద్దాలను పగుల గొట్టి వారిని అదుపులోకి తీసుకున్నారు. కాగా.. వాహనాలపై దాడి చేసి వారిని పట్టుకోవడం స్థానికులకు ఆందోళన కలిగించింది. అంతేకాకుండా ఆర్టీసీ బస్సులు కూడా నిలబడి ప్రయాణీకులంతా వీరిని అదుపులోకి తీసుకోవడం, దాడి దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారు. ఇందులో కర్ణాటకకు చెందిన కెఏ53ఎంఎం 3227 గల ఇన్నోవా క్రిష్టా కూడా ఉంది. ఈవాహనంలో దాదాపు 9మంది ఎర్రచందనం కూలీలు ఉన్నట్లు సమాచారం. వీరందరిని కడపకు తరలించారు. ఆ మేరకు రూరల్ ఎస్ఐ అరుణ్ రెడ్డిని వివరణ కోరగా ఎర్రచందనం స్మగ్లర్లు, కూలీలను స్పెషల్ టాస్క్ ఫోర్సు పట్టుకున్నారని అన్నారు.

మాజీ మంత్రి రాజగోపాల్‌రెడ్డికి ఘనంగా నివాళులు



రాజగోపాల్‌రెడ్డి ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న శ్రీనివాసరెడ్డి, శ్రావణ్‌రాజ్‌కుమార్‌రెడ్డి, తదితరులు

లక్కిరెడ్డిపల్లె, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి రెడ్డెప్పగారి రాజగోపాల్ రెడ్డి 11వ వర్ధంతి సందర్భంగా గురువారం ఆయన సతీమణి హేమలతమ్మ, కుమారులు టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆర్.రమేశ్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి కుమారుడు, వైఎస్ఆర్ క్రికెట్ స్టేడియం చైర్మన్ శ్రావణ్‌రాజ్‌కుమార్‌రెడ్డి, కుటుంబ సభ్యులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మా తండ్రి రాజగోపాల్‌రెడ్డి లక్కిరెడ్డిపల్లె నియోజకవర్గంలో నాలుగు పర్యాయాలు ఎమ్మెల్యేగా, రెండు పర్యాయాలు మంత్రిగా పనిచేసి ప్రజల మన్ననలు పొందారని తెలిపారు. 1983లో నందమూరి తారకరామారావు తెలుగుదేశం పార్టీ ప్రవేశపెట్టిన సమయంలో ముఖ్యపాత్ర పోషించి వెలిగల్లు ప్రాజెక్టు రూపకర్తగా నిలిచారన్నారు. అంతేగాకుండా వృద్ధులకు రూ.30 పింఛన్ పథకాన్ని రాజగోపాల్‌రెడ్డి రామారావు దృష్టికి తీసుకెళ్లి పింఛన్ పథకాన్ని ప్రవేశపెట్టారని చెప్పారు. కార్యక్రమంలో నాగులగుట్టపల్లి హరినాథరెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్‌లు కాలాడి ప్రభాకర్‌రెడ్డి, మద్దిరేవుల రమేశ్‌రెడ్డి, రామాపురం, గాలివీడు, చక్రాయపేట, లక్కిరెడ్డిపల్లె మండలాలకు చెందిన ఆర్ఆర్ అభిమానులు పాల్గొన్నారు.

శరవేగంగా బ్రిడ్జి పనులు



గండికొవ్వూరు బ్రిడ్జికి సంబంధించి పూర్తయిన 29 పిల్లర్లు

చక్రాయపేట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండికొవ్వూరు-వెన్నపల్లె మధ్యలో పాపాఘ్ని నదిపై నిర్మిస్తున్న హైలెవెల్ బ్రిడ్జి పనులు శరవేగంగా సాగుతున్నాయి. మండల కేంద్రమైన చక్రాయపేటకు రావాలంటే పాపాఘ్ని తీరప్రాంత వాసులు దాదాపు 15కిలోమీటర్లు చుట్టు తిరిగి రావాలి. ఈ బ్రిడ్జి పూర్తయితే వీరికి 12 కి.మీద దూరం తగ్గుతుంది. ఇది కడప, అనంతపురం జిల్లాలకు సైతం ఈ బ్రిడ్జి ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ఇక్కడ 20ఏళ్లుగా బ్రిడ్జి నిర్మాణం ప్రతిపాదనలకే పరిమితమై ఉండేది. ఇటీవల ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజనకింద దాదాపు రూ.28 కోట్లతో బ్రిడ్జి మంజూరులైంది. ఆ పనులను ఎంపీ సీఎం రమేశ్‌నాయుడు కంపెనీ దక్కించుకుంది. వేగంగా పనులు జరుగుతున్నాయి. రెండు నెలల్లోనే దాదాపు 29 పిల్లర్లు పూర్తి అయ్యాయి. సాయినాయుడు అనే సబ్ కాంట్రాక్టర్ అక్కడే ఉండి పనులు పర్యవేక్షిస్తున్నారు. వచ్చే ఏడాది జనవరి నాటికి బ్రిడ్జి నిర్మాణం పూర్తి అవుతుందని చెబుతున్నారు. ఈ బ్రిడ్జి పూర్తయితే పాపాఘ్ని తీరప్రాంతంలోని దాదాపు 12 గ్రామాలతో పాటు కదిరి, అనంతపురం, తలుపుల వెళ్లాలంటే దూరం తగ్గుతుంది.



పిల్లర్లపై అమర్చడానికి సిద్ధంగా ఉన్న బీములు

అత్యవసరమా.. అవతలికెళ్లు..!

- సమయపాలన పాటించని వైద్యులు
- ఎక్కువ సమయం ప్రైవేటు ప్రాక్టీస్‌లోనే
- సామాన్య రోగులకు తప్పని తిప్పలు
- సీజనల్ వ్యాధులతో ప్రజల ఇబ్బందులు
- ఇదీ రాయచోటి ఏరియా ఆసుపత్రి తీరు

అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటిలో 100 పడకల ఏరియా ఆసుపత్రి ఉన్నప్పటికీ.. ఇక్కడ ఎమర్జెన్సీ వైద్యసేవలు అందడం లేదు. అత్యవసరం అంటూ ఎవరు పోయినా వేరే ప్రాంతాలకు రెఫర్ చేస్తున్నారు. దీనికితోడు ప్రస్తుతం జనాన్ని వేధిస్తున్న సీజనల్ వ్యాధులకూ వైద్యసేవలు సరిగా అందడం లేదని రోగులు ఆరోపిస్తున్నారు. దీనికి కారణం ఇక్కడ పనిచేసే వైద్యులు సమయపాలన పాటించకపోవడంతో పాటు ఎక్కువ సమయం ప్రైవేటు ప్రాక్టీస్‌లో గడుపుతుండటమే.

రాయచోటిటౌన్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): రాయచోటి ఏరియా ఆసుపత్రిలో ప్రతి రోజు 800 నుంచి 900 వరకు ఓపీ ఉంటోంది. పట్టణానికి చెందిన వందలాది మంది పేదలు ప్రతిరోజు ఏరియా ఆసుపత్రికి వచ్చి చికిత్స చేయించుకుంటున్నారు. అయితే ఆసుపత్రిలో పనిచేస్తున్న చాలా మంది వైద్యులు ఎక్కువ సమయం ప్రైవేటు ప్రాక్టీస్‌లో గడుపుతుండడంతో రోగులకు సరైన వైద్య సేవలు అందడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనికి తోడు ఆసుపత్రికి వచ్చే జనరల్ వైద్యుల్లో కొంత మంది ఓపీ చూడకుండా కేవలం ఆపరేషన్లకే పరిమితం అవుతున్నారు. అలాగే స్త్రీల శస్త్ర చికిత్స విభాగం, పురుషుల శస్త్ర చికిత్స విభాగాల్లో వైద్యులు అంతంత మాత్రమే విధులకు హాజరవుతుండడంతో చాలా మంది రోగులు సరైన వైద్యం అందక ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు.

పని ఇక్కడ.. నివాసం వేరేచోట

రాయచోటి నియోజకవర్గంతో పాటు రాజంపేట, పీలేరు, పులివెందుల నియోజకవర్గాల్లోని వీరబల్లి, సుండుపల్లె, కేవీపల్లి, కలకడ, కలికిరి, గుర్రంకొండ, చక్రాయపేట, సత్యసాయి జిల్లాలోని కదిరి, ఎన్పీ కుంట తదితర మండలాల నుంచి కూడా ఎంతో మంది పేద రోగులు రాయచోటి ఏరియా ఆసుపత్రికి వైద్యంకోసం వస్తుంటారు. వైద్యులు పనిచేసేచోటే నివాసం ఉండాలనే నిబంధన ఉంది. అయితే ఇక్కడ పనిచేస్తున్న వైద్యులు కొంతమంది కడప, పీలేరు నుంచి విధులకు హాజరవుతుండటంతో వీరు సమయానికి రావడం లేదని అంటున్నారు. రాయచోటి ఏరియా ఆసుపత్రిలో 23 మంది వైద్యులకు గానూ ప్రస్తుతం 21 మంది ఉండగా ఒక జనరల్ మెడిసిన్, ఒక ఆర్థోపెడిక్ వైద్యుల కొరత ఉంది.

ఆర్థోపెడిక్ డాక్టర్ లేక..

రోడ్డు ప్రమాదాల బారిన పడిన క్షతగాత్రులకు చికిత్స అందించాల్సిన ఆర్థోపెడిక్ డాక్టర్ లేకపోవడంతో ఎమర్జెన్సీ వైద్యం అందక సామాన్య రోగులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని తిరుపతి, వేలూరు, బెంగళూరు ప్రాంతాలకు పరుగులు తీస్తున్నారు. ఇటీవల వినాయక చవితి సందర్భంగా వినాయకుడి విగ్రహాల ఏర్పాటు పరిశీలనకు వెళ్లిన ప్రసాద్ అనే కానిస్టేబుల్ ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదానికి గురై రాయచోటి ఏరియా ఆసుపత్రికి వచ్చారు. ఆ సమయంలో డ్యూటీ డాక్టర్ అందుబాటులో లేకపోవడంతో మెరుగైన చికిత్స కోసం బెంగళూరుకు వెళ్లారు. దీనికి తోడు సీజనల్ వ్యాధులతో అల్లాడుతూ ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాల్సిన కొంతమంది సీనియర్ వైద్యులు కేవలం ఆపరేషన్లకు పరిమితం అవుతుండడంతో రోగులు ప్రైవేటు ఆసుపత్రుల వైపు చూస్తున్నారు.



సీజనల్ వ్యాధులతో ఓపీ వద్ద బారులుతీరిన రోగులు

ప్రహరీ గోడ కూలిపోయి..

కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించిన 100 పడకల ఆసుపత్రికి పడమర భాగంలో ఉన్న పాత ప్రహరీగోడ వర్షాలకు కూలిపోయింది. దీంతో ఆసుపత్రి ఆవరణం పశువులు, కుక్కలకు ఆవాసంగా మారింది. మందుబాబులు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారు పడమర వైపు నుంచి ఆసుపత్రి ఆవరణలోకి ప్రవేశిస్తుండడంతో రాత్రి సమయాల్లో ఇక్కడ ఉండే రోగులకు రక్షణ లేకుండా పోయింది. దీనికి తోడు ఆసుపత్రి రోగులకు, సిబ్బందికి నీటి కొరత కూడా వెంటాడుతోంది. కూలిపోయిన ప్రహరీగోడను త్వరగా పూర్తి చేసి పశువులు, కుక్కలు, మందుబాబులు ఆసుపత్రిలోకి ప్రవేశించకుండా చూడాలని పట్టణ ప్రజలు, రోగులు, ఆసుపత్రి సిబ్బంది కోరుతున్నారు.

రూ.23 కోట్లతో క్రిటికల్ కేర్ యూనిట్

వైసీపీ ప్రభుత్వంలో ఆసుపత్రి నిర్మించినప్పటికీ ఎమర్జెన్సీ కేసులకు అవసరమైన క్రిటికల్‌కేర్ యూనిట్‌ను ఏర్పాటు చేయలేదు. దీంతో సకాలంలో సరైన ఎమర్జెన్సీ వైద్యం అందక కొందరు కాళ్లు, చేతులు పోగొట్టుకొని వికలాంగులైన దాఖలాలు కూడా ఉన్నాయి. ఈ సమస్యను మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రాయచోటి ఏరియా ఆసుపత్రికి రూ.23.75 కోట్లతో క్రిటికల్ కేర్ యూనిట్‌ను మంజూరు చేయించడమే కాకుండా ఇటీవలనే దీని నిర్మాణానికి భూమిపూజ కూడా చేపట్టారు. 50 పడకలతో కూడిన క్రిటికల్ కేర్ యూనిట్ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. ఇది అందుబాటులోకి వస్తే రోడ్డు ప్రమాద బాధితులకు ఇక్కడే మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవకాశం ఉంటుంది.



మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నాం



వివిధ ప్రాంతాల నుంచి రాయచోటి ఏరియా ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలను అందిస్తున్నాం. ప్రతి రోజు 800 నుంచి 900 వరకు ఓపీ నడుస్తోంది. ప్రస్తుతం ఏరియా ఆసుపత్రిలో 23 మంది వైద్యులకు గానూ 21 మంది ఉన్నారు. ఒక జనరల్ మెడిసిన్, ఒక ఆర్థోపెడిక్ వైద్యులు రావాల్సి ఉంది. ప్రస్తుతం నీటికొరత లేదు. ఆసుపత్రికి పడమర భాగంలో ప్రహరీ గోడ నిర్మించాల్సి ఉంది. 50 పడకలతో కూడిన క్రిటికల్ కేర్ యూనిట్ పూర్తయితే ఎమర్జెన్సీ వైద్య సేవలు అందరికీ అందుబాటులోకి వస్తాయి.

- డేవిడ్ కుమార్, సూపరింటెండెంట్, రాయచోటి ఏరియా ఆసుపత్రి

ఐదు బార్లకు లైసెన్సులు కేటాయింపు

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణంలోని ఐదు బార్లకు లక్కీడిప్ ద్వారా లైసెన్సులు కేటాయించామని ఎక్సైజ్ సీఐ భీమలింగ పేర్కొన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ పట్టణంలో ఐదు బార్లు మంజూరు కాగా వాటిలో నాలుగు బార్లకు ఇది వరకే కలెక్టర్ లక్కీడిప్ ద్వారా కేటాయించారన్నారు. మిగిలిన ఒక బార్‌కు గురువారం రాయచోటిలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ లక్కీడిప్ ద్వారా ఎంపిక చేసి చలపతినాయుడుకు లైసెన్సు మంజూరు చేశారన్నారు. బి.కొత్తకోటలో ఒక బార్‌కు ఈడిగ కులానికి కేటాయించగా కుడుము ఆదిత్యకు లైసెన్సు దక్కిందన్నారు.

'బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలి'

పీలేరు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): టీటీడీలో ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను చిత్తూరు, అన్నమయ్య జిల్లాల ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానటరింగ్ కమిటీ సభ్యులు విజ్ఞప్తి చేశారు. తిరుమల పర్యటనకు వచ్చిన గవర్నర్‌ను బుధవారం రాత్రి కలిసిన డీవీఎంసీ సభ్యులు పాలకుంట శ్రీనివాసులు, రాజ్ కుమార్, మునీంద్ర నాయక్ వినతి పత్రం అందించారు. టీటీడీ షాపింగ్ కాంప్లెక్సులలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించాలని, ఉద్యోగాల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లా వాసులకు అధిక ప్రాధాన్యత కల్పించాలని కోరారు.

నలుగురు ఫీల్డ్ అసిస్టెంట్లకు మెమోలు జారీ

పెద్దతిప్పసముద్రం సెప్టెంబర్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న నలుగురికి ఏపీడీ నందకుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు మెమోలు జారీ చేసినట్లు ఇన్‌చార్జ్ ఏపీఓ సుధాకర్ తెలిపారు. గురువారం ఉపాధి కార్యాలయంలో మండలంలో జరుగుతున్న ఉపాధి పనులపై ఏపీడీ సమీక్షించారు. తుమ్మరకుంట ఫీల్డ్ అసిస్టెంట్ రమణ, బూర్లపల్లె ఫీల్డ్ అసిస్టెంట్ ఓబులేసు, అంకిరెడ్డిపల్లె ఫీల్డ్ అసిస్టెంట్ ఆదినారాయణ, మడుమూరు ఫీల్డ్ అసిస్టెంట్ భార్గవ్ సమావేశానికి కనీస సమాచారం ఇవ్వకుండా హాజరు కాకుండా విధుల పట్ల నిర్లక్ష్యం వహించినందుకు వారిపై క్రమశిక్షణ చర్యల్లో భాగంగా మెమోలు జారీ చేసినట్లు ఆయన తెలిపారు.

రుషివాటిక పాఠశాలకు నోటీసు

బి.కొత్తకోట, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట మండలం గట్టు పంచాయతీ గట్లపై నిర్వహిస్తున్న రుషివాటిక ఆశ్రమ పాఠశాలకు విద్యాశాఖాధికారులు నోటీసు జారీచేశారు. వేదభారతి ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పాఠశాలలో ఇటీవల జరిగిన ఘటనలో లక్కిరెడ్డిపల్లి మండలానికి చెందిన విద్యార్థి శేషాద్రి తీవ్రంగా గాయపడి కనుచూపు కోల్పోవడం, దీనిపై బి.కొత్తకోట పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ పాఠశాల నిర్వాహకులు అందజేసిన వివరాల మేరకు హోం స్కూలింగ్‌కు అనుమతులు లేవని, విద్యార్థులకు తాత్కాలిక సాంస్కృతిక శిక్షణ ఇస్తున్నట్లు యాజమాన్యం పేర్కొందని విద్యాశాఖాధికారులు పేర్కొంటున్నారు. అలాంటి హోం స్కూలింగ్‌కు అనుమతులు లేవని, జీఓ ఎంఎస్ నెంబర్1, ఎడుకేషన్ (పీఎస్)01-01-1994 ప్రకారం ప్రభుత్వ అనుమతులు పొందిన తర్వాతే నిర్వహించాలని, లేని పక్షంలో నిర్వాహకులపై తగు చర్యలకు సిఫారసు చేస్తామని ఎంఈవో రెడ్డిశేఖర్ పాఠశాల సిబ్బందికి నోటీసు జారీచేశారు.

559 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

పుల్లంపేట/రాజంపేట టౌన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాజంపేట మండలాల్లో మండల పరిధిలోని జాగువారిపల్లె పంచాయతి సాదువారిపల్లె సమీపంలో అక్రమంగా తరలిస్తున్న 309 బస్తాల రేషన్ బియ్యాన్ని గురువారం పట్టుకుని సీజ్ చేసినట్లు తహశీల్దారు పుల్లారెడ్డి తెలిపారు. కర్ణాటక రిజిస్ట్రేషన్ కలిగిన కేఏ56 3519 నంబరు లారీలో ప్రజా పంపిణీకి చెందిన రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్నారని సమాచారం వచ్చిందన్నారు.

దీంతో రైల్వేకోడూరు ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహశీల్దారు శ్రీనివాసులు పరిశీలించి 309 బస్తాల (15.45 క్వింటాళ్ల)ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. లారీ డ్రైవర్ క్రాంతికుమార్‌ను అరెస్ట్ చేసి లారీని పుల్లంపేట పోలీసుస్టేషన్‌కు తరలించారు. పట్టుబడిన రేషన్ బియ్యాన్ని రాజంపేట స్టాకు పాయింట్‌కు తరలించినట్లు తహశీల్దారు తెలిపారు.

అలాగే.. రాజంపేట మండల పరిధిలోని మిట్టమీదపల్లె గ్రామ శివారులో గురువారం గుట్టపై నిల్వ ఉంచిన 250 బస్తాల రేషన్ బియ్యాన్ని సీజ్ చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రవికుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యం అక్రమంగా తరలించవద్దని, లేనిపక్షంలో వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. పట్టుబడ్డ బియ్యాన్ని రాజంపేట డిపోకు తరలించినట్లు ఆయన పేర్కొన్నారు.





రాజంపేట : గదిలో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యం - పుల్లంపేట : పట్టుబడిన రేషన్ బియ్యం లారీతో ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ శ్రీనివాసులు

పశువుల వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



చికిత్సను పరిశీలిస్తున్న జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి గుణశేఖర్‌పిళ్లై

గాలివీడు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): పశువుల్లో గర్భకోశ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండి ఎప్పటికప్పుడు పశువైద్యులను సంప్రదించాలని జిల్లా పశుసంవర్థకశాఖ అధికారి డాక్టర్ గుణశేఖర్‌పిళ్లై పేర్కొన్నారు. గురువారం మండలంలోని ఎగువగొట్టివీడు గ్రామం కుమ్మరపల్లిలో రాష్ట్రీయ గోకుల్‌మిషన్‌లో భాగంగా పశుగణాభివృద్ధి, పశుసంవర్థకశాఖ ఆధ్వర్యంలో జరిగిన ఉచిత గర్భకోశ వ్యాధి చికిత్సా శిబిరంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా శిబిరంలో 35 ఎదకు రాని పశువులను, 25 పశువులకు సాధారణ పరీక్షలు, 62 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు తెలిపారు. అంతేగాక గొంతువాపు నివారణ టీకాలు వేయడం, దూడలకు నట్టల నివారణ మందులు తాపామన్నారు. అనంతరం పాడి రైతులకు పలు సూచనలు, సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో రాయచోటి ఉప సంచాలకులు మాలకొండయ్య, సహాయ సంచాలకులు శివారెడ్డి, స్థానిక పశువైద్యులు నాగరాజు, సిబ్బంది శశికళ, లక్ష్మినారాయణ, హేమసుందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణ.. స్థానికుల నిరసన



ప్రభుత్వభూమి కబ్జా చేశారని నిరసన తెలుపుతున్న గ్రామస్థులు

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూమిని విశ్రాంత లెక్చరర్ వెంకటరమణ ఆక్రమించారని గ్రామస్థులు గురువారం స్థలంలో నిరసన చేపట్టారు. మదనపల్లె మండలం, కొత్తవారిపల్లె పంచాయతీ, ఎనుములవారిపల్లె గ్రామదేవత గంగమ్మ ఆలయం ముందర ప్రభుత్వ స్థలాన్ని అక్రమించారని ఆరోపించారు. దీని పక్కనే ఉన్న భూమిని వెంకటరమణ కోనుగోలు చేశారని, దాంట్లోకి కలిపేసుకునేందుకు ప్రభుత్వ భూమిని చదును చేసినట్లు గ్రామస్థులు ఆరోపించారు. రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా సర్వే చేసి ఇది ప్రభుత్వ భూమిగా తేల్చారని గ్రామస్తులు వివరించారు. ఈ విషయమై ఆయనను వివరణ కోరగా ఈ స్థలం పక్కనే భూమిని కోనుగోలు చేశానని, ఇల్లు కట్టుకుంటే రోడ్డుపై నేను ఏలా వెళ్లాలని ప్రశ్నించారు. సర్వేలో ఎలా తేలితే అలా నడుచు కుంటానన్నారు.

నేటి నుంచి డాక్యుమెంట్ రైటర్ల పెన్‌డౌన్

కలికిరి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): శుక్రవారం నుంచి సబ్ రిజిస్ట్రారు కార్యాలయాల ప్రైవేటు డాక్యుమెంట్ రైటర్లు పెన్ డౌన్ నిరసనకు దిగుతున్నట్లు స్థానిక డాక్యుమెంట్ రైటర్లు తెలిపారు. దీని కారణంగా వీరు ఎలాంటి దస్తావేజులు తయారు చేయరు. రాష్ట్ర సంఘం ఈ మేరకు సమాచారమిచ్చినట్లు చెప్పారు. ఆస్తులు కొనుగోలు, అమ్మకాల వ్యవహారాలను సబ్ రిజిస్ట్రారు కార్యాలయాల్లో పూర్తి చేయడానికి డాక్యుమెంట్ రైటర్లు దస్తావేజులను తయారు చేస్తారు. దీనికి అనుబంధంగా ఈ మొత్తం లావాదేవీల వివరాలను ఇంగ్లీషులో పబ్లిక్ డాటా ఎంట్రీ (పీడీఈ) పేరుతో డిజిటల్ డాక్యుమెంట్‌ను కూడా వీరు తయారు చేసి దస్తావేజుతోపాటు పీడీఈని కూడా రిజిస్ట్రేషన్ కోసం సమర్పించాల్సి ఉంది. అయితే పీడీఈ డిజిటల్ డాక్యుమెంట్‌లో ఏవైనా సవరణలు అవసరమైతే దస్తావేజులోని వివరాల ఆధారంగా సబ్ రిజిస్ట్రారు కార్యాలయం ఉద్యోగులు దాన్ని సవరించే (కరెక్షన్) వెసులుబాటు ఉండేది. అయితే ఇటీవల సబ్ రిజిస్ట్రారు కార్యాలయంలో కరెక్షన్ చేసే వెసులుబాటును తొలగించారు. పీడీఈలో ఏ చిన్నపాటి సవరణకైనా ముందు తయారు చేసిన డిజిటల్ డాక్యుమెంట్‌ను పూర్తిగా తొలగించి తిరిగి మొత్తం తయారు చేయాల్సి ఉంది. దీంతో రిజిస్ట్రేషన్ల తీవ్రమైన కాలయాపన జరుగుతోందని రైటర్లు చెపుతున్నారు. ఆస్తుల కొనుగోలు అమ్మకందార్లు పదే పదే వారి మొబైల్ ఫోన్‌లకు వచ్చే ఓటీపీలను రైటర్లకు చెప్పాల్సి ఉంది. చాలా మంది ఫోన్ నంబర్లు ఆధార్ కార్డుకు అనుసంధానం కాకపోవడంతో దీన్ని కూడా పూర్తి చేస్తేగానీ ఓటీపీలు వచ్చే అవకాశం లేదు. దీంతోపాటు మరికొన్ని సమస్యలు పరిష్కారించాల్సిందిగా కోరుతూ పెన్‌డౌన్ నిరసన చేపట్టి శుక్రవారం నుంచి రిజిస్ట్రేషన్లను బహిష్కరిస్తున్నట్లు రైటర్లు చెప్పారు.

రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు విద్యార్థినులు

నందలూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మహాత్మా జ్యోతిబాపూలే ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాల కళాశాల విద్యార్థినులు రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీల్లో ప్రతిభ చూపారు. కడప స్పోర్ట్స్ స్కూల్, పులివెందులలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి అండర్-19, అండర్-17, 14 రగ్బీ పోటీల్లో ఉత్తమ ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ నాగేశ్వరి గురువారం మాట్లాడుతూ జి.గురుస్నేహలత (ఇంటర్మీడియట్), పి.లక్ష్మీస్పందన(10వ తరగతి), వై.నవ్యశ్రీ(9వ తరగతి), వై.మహిమ(9వ తరగతి) రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థినులు క్రీడల్లో రాణించడానికి కృషి చేస్తున్న వ్యాయామ ఉపాధ్యాయురాలు కేజీ సునీతకు ప్రిన్సిపాల్, సిబ్బంది, తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు.

సమగ్రాభివృద్ధిపై దృష్టి సారించాలి : కలెక్టర్

రాయచోటి(నేతాజీసర్కిల్), సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): రాయచోటి నియోజకవర్గ సమగ్రాభివృద్ధిపై దృష్టి సారించాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. గురువారం రాయచోటి కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో తహశీల్దార్లు, ఎంపీడీవో వివిధ శాఖల, మండల స్థాయి సిబ్బంది తదితరులతో రెవెన్యూ, ఎన్టీఆర్ భరోసా పింఛన్లు, వ్యవసాయం, ఉద్యానవనం, గ్రామీణ నీటి సరఫరా, నీటిపారుదల, విద్యుత్, పర్యాటకం తదితర అంశాలపై ఆయన నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. సమావేశాన్ని ప్రారంభించిన రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్ అన్నదాత సుఖీభవ, ఉచిత బస్సు పథకం, దీపం, తల్లికి వందనం, వంటి పథకాలపై వివిధ అంశాలను కలెక్టర్‌కు వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకంలో ఈకేవైసీ పెండింగ్ అంశాలను త్వరగా పరిష్కరించాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారిని ఆదేశించారు. స్త్రీశక్తి పథకంలో బస్సుల్లో ఆక్యుపెన్సీ రేషియో తదితర అంశాలపై ఆర్టీసీ అధికారిని వివరాలను అడిగి తెలుసుకున్నారు. పౌరసరఫరాలపై సమీక్షిస్తూ స్మార్ట్‌కార్డుల పంపిణీ వీలైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. అంతేకాకుండా హౌసింగ్, ఉద్యానవనశాఖ, పంచాయతీరాజ్, చెత్తసేకరణపై దృష్టి సారించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం రీసర్వే, పర్యాటకం తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సమావేశంలో నియోజకవర్గ మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, వివిధ శాఖల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



శాఖల ప్రాధాన్యత అంశాలపై మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

రైలుకింద పడి యువకుడు మృతి



జయసింహ (ఫైల్)

నందలూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ అరవపల్లె గ్రామానికి చెందిన కాశిగారి జయసింహ(26) అనే యువకుడు రైలుకింద పడి మృతిచెందాడు. మృతుని బంధువుల వివరాల మేరకు.. కాశిగారి పెంచలయ్య, సరస్వతి దంపతుల ప్రథమ కుమారుడైన జయసింహ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఉపాధి నిమిత్తం బెంగుళూరు వెళ్లి మూడు రోజుల క్రితం సొంత గ్రామానికి వచ్చాడు. కాగా గురువారం సాయంత్రం యువకుడు స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో రైలుకింద పడి మృతిచెందినట్లు బంధువులు తెలిపారు. యువకుడు మృతితో వారి తల్లిదండ్రులు శోకసంద్రంలో మునిగిపోయారు. ఈ సంఘటనపై సీఆర్పీ పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పంచనామా నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు.

లారీ బోల్తా.. డ్రైవర్లకు గాయాలు



బోల్తా పడిన టమోటాల లారీ

ములకలచెరువు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ముంబాయి - చెన్నై జాతీయ రహదారిలో గురువారం తెల్లవారుజామున టమోటా లారీ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఇద్దరు డ్రైవర్లకు స్వల్ప గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. ములకలచెరువు నుంచి చత్తీస్‌ఘడ్‌కు టమోటాలు తీసుకెళ్తున్న లారీ తెల్లవారుజామున ఒంటిగంట సమయంలో ఎదురుగా వస్తున్న ఓ ప్రవేటు బస్సు మీదకు దూసుకురావడంతో తప్పించబోయి అదుపు తప్పి రోడ్డు పక్కన బోల్తా పడింది. ఈ ప్రమాదంలో మదనపల్లెకు చెందిన డ్రైవర్లు సయ్యద్‌బాషా, షబ్బీర్ స్వల్పంగా గాయపడ్డారు. వీరిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందించారు. లారీ బోల్తాపడడంతో అందులో ఉన్న టమోటాలు నేలపాలై తీవ్ర నష్టం వాటిల్లింది.

చికిత్సపొందుతూ మహిళ మృతి



శోభారాణి (ఫైల్‌ఫొటో)

కలకడ, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న మహిళ శోభారాణి(34) మృతి చెందినట్లు హెడ్ కానిస్టేబుల్ రమేశ్‌బాబు తెలిపారు. ఆయన వివరాల మేరకు.. వాల్మీకిపురం మండలం దయ్యాలబండ వాసి వెంకటరమణ భార్య శోభారాణి ఈ నెల 14న సొంత పనుల నిమితం కలకడకు వచ్చి తిరిగి గుర్రంకొండకు ద్విచక్ర వాహనంలో బయలుదేరింది. కదిరాయచెరువు సమీపంలోని స్పీడ్ బ్రేకర్ వద్ద అదుపుతప్పి కిందపడడంతో తలకు గాయమైంది. గాయపడిన మహిళను మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు తెలిపారు.

భూతగాదాలో ఘర్షణ.. ఇరువర్గాలపై కేసు

నిమ్మనపల్లి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): భూతగాదాలో ఘర్షణ పడిన ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ తవళం పంచాయతీ నల్లంవారిపల్లి వాసులు శ్రీనివాసులు అతని భార్య భువనేశ్వరి దాయాదులైన రెడ్డెప్ప, అంజమ్మలకు భూమి విషయమై ఘర్షణ జరిగింది, దీంతో ఒకరినొకరు కొట్టుకుని పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు. ఇరు వర్గాలు ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకోవడంతో నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

మద్యం తాగి అమ్మ కొడుతోంది

ఫిర్యాదు చేసిన పిల్లలు

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి రోజూ తమను అమ్మ కొడుతోందని, అమ్మపైన ఆమెకు మద్యం తెచ్చిచ్చే వ్యక్తిపైనా చర్యలు తీసుకోవాలని పిల్లలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పిల్లల కథనం మేరకు..

మదనపల్లె పట్టణం, బాలజీ కాలనీలో కాపురం ఉంటున్న లక్ష్మన్న, వాణీ దంపతులకు టెన్త్, ఏడోవతరగతి చదివే ఇద్దరు పిల్లలు ఉన్నారు. లక్ష్మన్న యాక్సిడెంట్ కేసులో జైలుకు వెళ్లి శిక్ష అనుభవిస్తున్నాడు. ఏడాదిగా వాణి మద్యానికి బానిసయ్యారు. ఆమెకు ఆటో డ్రైవర్ రెడ్డి నిత్యం మద్యం తెచ్చి ఇస్తున్నాడు. మద్యం తాగి తరువాత ఆమె ఇంట్లో సంగటి కర్రతో రోజూ తమను విచక్షణారహితంగా కొడుతోందని పిల్లలు తెలిపారు. ఆదే వీధిలో ఉన్న ప్రదీప్, మోహన్‌రాజ్ పిల్లలను కాపాడే ప్రయత్నం చేయగా వారిపైనా ఆమె దాడికి దిగారు. దీంతో గురువారం పిల్లలిద్దరూ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశారు. అనంతరం వీరిద్దరూ మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఉల్లి రైతు కన్నీరు...

● ధర పతనంతో ఆవేదనలో అన్నదాతలు

వీరపునాయునిపల్లె, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉల్లి చేసే మేలు తల్లి కూడా చేయదని నానుడి. అలాంటి ఉల్లి పంట సాగు చేసిన రైతులు పెట్టిన పెట్టుబడి కూడా రాక కన్నీరు కారుస్తున్నారు. ఆరుగాలం శ్రమించి దిగుబడి చేతికందే సమయంలో బహిరంగ మార్కెట్‌లో ధర పతనం కావడంతో దిగాలు చెందుతున్నారు. ఒకవైపు అధికవర్షాలు మరోవైపు మార్కెట్‌లో ధర పతనంతో ఉల్లి రైతుల బాధలు వర్ణణాతీతంగా మారాయి. పంటకు గిట్టుబాటు



వీరపునాయునిపల్లెలో కోత కోసి మార్కెట్‌కు తరలించేందుకు ఉంచిన ఉల్లిగడ్డలు

ధర లేకపోవడంతో కొందరు రైతులు పొలాల్లోనే గొర్రెలు, మేకలు, పశువులకు వదిలేస్తున్నారు. క్వింటా 600 రూపాయలకు ధర పడిపోవడంతో పెట్టుబడులు కూడా రావడం లేదని వ్యక్తం చేస్తున్నారు. మండలంలో 4089 ఎకరాలలో రైతులు ఉల్లిపంటను సాగు చేశారు. అంకిరెడ్డిపల్లె, కొమ్మద్ది, బుసిరెడ్డిపల్లె, అడవిచెర్లోపల్లె, వెల్లుర్తి, వెంకటాపురం, వీఎన్‌పల్లె, అనిమెల, యు.రాజుపాలెం, తాటిమాకులపల్లె గ్రామాలలో రైతులు అధికంగా సాగుచేశారు. ప్రభుత్వం చర్యలు తీసుకొని ఉల్లి రైతులను ఆదుకోవాల్సిన అవసరం ఉంది.

ధర లేదని... అధైర్యపడకండి

సింహాద్రిపురం, సెప్టెంబరు 18: మండలంలో ఉల్లి సాగు చేసిన రైతులు ధర లేదని అధైర్యపడవద్దని మండల ఉద్యానవనశాఖ అధికారి మల్లేశ్వర్‌రెడ్డి రైతులకు సూచించారు. గురువారం రావులకొలను పంచాయతీలోని అహోబిళం గ్రామానికి చెందిన రైతు అంకాల్‌రెడ్డి ఉల్లి గడ్డలను గ్రామస్తులకు ఉచితంగా ఇవ్వడంతో పాటు మిగిలిన వాటిని ఆరుబయట పారవేయడంతో హెచ్‌ఓ వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా ఉద్యానవనశాఖ అధికారి మాట్లాడుతూ త్వరలో ప్రభుత్వం నుంచి జీఓ రాగానే మార్క్‌ఫెడ్ ద్వారా కిలో రూ.12లు ధరతో కొనుగోలు చేస్తామని తెలిపారు. ఉల్లి రైతులు ఇ-పంటలో నమోదు చేసుకున్నట్లయితే ప్రతి రైతుకు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద ఇన్సూరెన్స్, ప్రభుత్వం ఇచ్చే ప్రత్యామ్నాయ ప్రోత్సాహకాలు వర్తిస్తాయన్నారు.

ఆందోళన వద్దు

ప్రభుత్వం ఆదుకుంటుంది :కలెక్టర్

ఖాజీపేట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ధర లేదని ఉల్లి రైతులు ఆందోళన చెందవద్దని.. ప్రభుత్వం ఆదుకుంటుందని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ అన్నారు. గురువారం ఆయన మండలంలో వర్షాలకు దెబ్బతిన్న ఉల్లి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ నూర్పిడి చేసిన ఉల్లి పంటను వర్షాలకు భయపడి నిలువ ఉంచుకోలేక తక్కువ ధరకు రూ.5-6లకే అమ్ముకోవాల్సి వస్తోందని, వెంటనే ప్రభుత్వం కొనుగోలు చేసేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు కలెక్టర్ స్పందిస్తూ రైతులకు న్యాయం జరిగేలా చేస్తామని, ఉల్లిపంటను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని భరోసా కల్పించారు. జిల్లా వ్యవసాయశాఖ అధికారి చంద్రానాయక్, తహసీల్దారు ఏవీ రమణమ్మ, వ్యవసాయశాఖాధికారి నాగార్జున, సీఐ వంశీధర్, మార్కెట్‌యార్డు డైరెక్టర్ వెంకటరామిరెడ్డి, మాజీ సర్పంచ్ రెడ్యం వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.



ఉల్లి పంటను పరిశీలిస్తున్న కలెక్టర్ చెరుకూరి శ్రీధర్

నాసిరకం విత్తనాలతో నష్టపోయాం..

● న్యాయం చేయాలని రైతుల వేడుకోలు



మొక్కజొన్న కంకులను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు

ముద్దనూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): నాసిరకం విత్తనాలతో నష్టపోయాం.. మమ్ములను ఆదుకోవాలని మొక్కజొన్న పంట సాగు చేసిన రైతులు శాస్త్రవేత్తలకు విజ్ఞప్తి చేశారు. గురువారం మండల పరిధి శెట్టివారిపల్లె గ్రామంలో రైతులు సాగు చేసిన మొక్క జొన్న పంటను కడప డాట్ సెంటర్ శాస్త్రవేత్తలు వెంకటపతి, డాక్టర్ క్రిష్ణప్రియ, శ్రీవల్లి, మాధురి, యాస్మిన్ బృందం, వ్యవసాయాధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు తమగోడు వెల్లబోసుకున్నారు. తాము కొద్ది రోజుల క్రితం అనంతపురం జిల్లా తాడిపత్రిలోని శ్రీమధుసాయి ట్రేడర్స్‌లో మొక్కజొన్న విత్తనాలు తీసుకువచ్చి పంట సాగుచేశామన్నారు. విత్తనాలు నాసిరకం కావడంతో పంట కాలం పూర్తయినా కంకికి విత్తనాలు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. డీలర్‌పై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ మేరకు పంటను పరిశీలించిన శాస్త్రవేత్తలు రైతుల వద్ద నుంచి విత్తన సాగు, ఎరువుల వాడకంపై వివరాలు ఆరా తీశారు. అన్ని కోణాల్లో పరిశీలించి పూర్తి నివేదిక జిల్లా వ్యవసాయాధికారులకు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏడీఏ రామ్మోహన్‌రెడ్డి, ఏవో వెంకటకృష్ణారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

డీఎస్సీ అభ్యర్థులు ఇళ్లకు తిరుగు ముఖం

● నియామక పత్రాల అందజేత కార్యక్రమం వాయిదా

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల కారణంగా మెగా డీఎస్సీ-2025 నూతన ఉపాధ్యాయుల నియామక పత్రాల అందజేత కార్యక్రమం వాయిదా పడింది. ఈనెల 19న జరగాల్సిన ఈ కార్యక్రమాన్ని వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో గుంటూరులో భారీ వర్షాలతో అభ్యర్థుల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతాయని కన్వీనర్ ఎంవీ కృష్ణారెడ్డి ప్రకటించారు. కొత్త తేదీలను త్వరలోనే వెల్లడిస్తామని తెలిపారు. అయితే ఈ కార్యక్రమానికి అభ్యర్థులు విజయవాడ వెళ్లేందుకు జిల్లా వ్యాప్తంగా 43 బస్సులను ఏర్పాటు చేశారు. గురువారం ఉదయం జిల్లా కేంద్రం డీఈఓ కార్యాలయం నుంచి బస్సులు ప్రారంభం కావాల్సి ఉండగా రాష్ట్ర విద్యాశాఖ నుంచి ఆదేశాలు రావడంతో అభ్యర్థులకు వాయిదా అయినట్లు జిల్లా విద్యాశాఖ అధికారులు ప్రకటించారు. దీంతో అభ్యర్థులు తిరిగి ఇంటి ముఖం పట్టారు. బస్సులు కూడా సంబంధిత డిపోలకు బయలు దేరాయి.

22 నుంచి జరగాల్సిన శిక్షణ కూడా... : నూతనంగా నియమితులైన ఉపాధ్యాయుల కోసం సెప్టెంబరు 22 నుంచి 29 వరకు జరగాల్సిన ఇండక్షన్ ట్రైనింగ్ వాయిదా పడింది. తదుపరి తేదీని త్వరలో ప్రకటించనున్నట్లు ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ తెలిపారు. ఈ విషయాన్ని సంబంధిత ఫ్యాకల్టీ సభ్యులు డీఆర్పీలకు వెంటనే తెలియజేయాలని ఆయన సూచించారు.



డీఈఓ కార్యాలయం వద్ద నుంచి ఇళ్లకు వెళుతున్న డీఎస్సీ అభ్యర్థులు

చోరీకి పాల్పడ్డ దొంగలు అరెస్ట్

రూ.8లక్షలు విలువైన బంగారు, వెండి ఆభరణాలు స్వాధీనం



పట్టుబడిన నిందితులను, ఆభరణాలను చూపుతున్న పోలీసులు

బద్వేలుటౌన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): బద్వేలు పట్టణం వెంకటయ్యనగర్‌లో ఈ నెల 10వ తేదీ ఇంటి తాళాలు పగులకొట్టి పట్టపగలు ఓ ఇంట్లో దోపిడీకి పాల్పడ్డ నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి రూ.8లక్షలు విలువైన బంగారు, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. గురువారం పట్టణం లోని అర్బన్‌పోలీస్‌స్టేషన్ ఆవరణలో మైదుకూరు డీఎస్పీ రాజేంద్ర ప్రసాద్, సీఐ లింగప్ప, ఎస్ఐ సత్యనారాయణలు వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఘటనా స్థలంలో సేకరించిన ఫింగర్‌ప్రింట్స్, సీసీపుటేజ్‌ల ఆధారంగా నిందితులు కడప ప్రాంతానికి చెందిన ఆటో డ్రైవర్ దిలీప్‌కుమార్, నాయబ్ రసూల్‌గా గుర్తించామన్నారు. వీరిపై గతంలో కూడా పలు చోరీ కేసులు ఉన్నట్లు వారు తెలిపారు. వీరి వద్ద నుంచి 118.04 గ్రాముల బంగారు నగలు, 4 గ్రాముల వెండి నాణేలను స్వాధీనం చేసుకున్నారు. నేరానికి ఉపయోగించిన ఆటోను సీజ్‌చేసి నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. చోరీ జరిగిన నాలుగురోజుల సమయంలోనే లింగప్ప పకడ్బందీగా నిందితులను పట్టుకున్నందుకు జిల్లా ఎస్పీ, డీఎస్పీలు అభినందించారు.

ఉద్యోగం పొందడం ఎలా..!

ట్రిపుల్‌ఐటీలో విద్యార్థులకు అవగాహన సదస్సు



మాట్లాడుతున్న అధికారిణి చల్లా రత్నకుమారి

వేంపల్లె, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మొదటిసారి ఉద్యోగం పొందడం ఎలా అనే అంశంపై ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో విద్యార్థులకు అవగాహన సమావేశం నిర్వహించారు. సమావేశ నిర్వహణ అధికారిణి చల్లా రత్నకుమారి, రిసోర్స్ పర్సన్ జానిబాష విద్యార్థులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ట్రిపుల్‌ఐటీలో చదివి స్టార్టప్ ప్రారంభించి రూ.3కోట్ల టర్నోవర్‌తో ఉన్న జానిబాష తన అనుభవాలను చెబుతూ ఎలా మొదటి ప్రయత్నంలో ఉద్యోగం పొందాలనే అంశాలను తెలిపారు. ఏఓ రవికుమార్, రమేష్, సత్యానంద, నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రం చేసుకోవాలి : మన పరిసరాలను మనమే పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ ఎన్ఎస్ఎస్ యూనిట్ కోఆర్డినేటర్లు సుబ్బరాయుడు, తిరుపతిరెడ్డి, దీప్తిలు తెలిపారు. గురువారం ఎన్ఎస్ఎస్ 11,15 యూనిట్‌ల ఆధ్వర్యంలో గురువారం పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. క్యాంపస్ ఆవరణలో ఉన్న చెత్తాచెదారాలను తొలగించారు. మొదట ర్యాలీ నిర్వహించారు.

రాజ్యాంగం పౌరులందరికీ అర్థమయ్యే భాషలో ఉండాలి

● జాతీయ సదస్సులో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.పద్మ



మాట్లాడుతున్న రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.పద్మ

కడప ఎడ్యుకేషన్,సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగం పౌరులందరికీ అర్థమయ్యే భాషలో ఉండాలని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.పద్మ పేర్కొన్నారు. గురువారం కడప యోగివేమన విశ్వవిద్యాలయంలో 75 సంవత్సరాల భారత రాజ్యాంగం-సాంకేతిక పదజాలంపై రెండు రోజుల జాతీయ సదస్సు ప్రారంభమైంది. రిజిస్ట్రార్ మాట్లాడుతూ రాజ్యాంగం పౌరులందరికీ అర్థమయ్యే భాషలో ఉండాలని, ప్రజల మాతృభాషలో విలువైన గ్రంథాలు అందుబాటులోకి రావాలని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టి.శ్రీనివాస్ రాజ్యాంగ హక్కులతో పాటు బాధ్యతలను గుర్తు చేసుకోవాలన్నారు. ముఖ్య వక్త ప్రొఫెసర్ నవేద్ జమాల్ రాజ్యాంగ సూత్రాలను అన్ని భారతీయ భాషలో సులభంగా అందించేందుకు సాంకేతిక పరిభాష అవసరమన్నారు. సీఎస్‌టీటీ అసిస్టెంట్ డైరెక్టర్లు జేఎస్ రావత్, షాజాద్ అహ్మద్ అన్సారీ సంస్థ భాషాభివృద్ధి కోసం చేస్తున్న కృషిని వివరించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం అధ్యాపకులు, వివిధ రాష్ట్రాల ప్రొఫెసర్లు, పరిశోధకులు పాల్గొన్నారు.

ఘనంగా దసరా ఉత్సవాలు

● దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్

కడప కల్చరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ మల్లికార్జున ప్రసాద్ తెలిపారు. నగరంలోని ఆకుల వీధిలో ఉన్న రాజరాజేశ్వరిదేవి దేవస్థానం పోస్టర్లను గురువారం ఆవిష్కరించి మాట్లాడారు. సుమారు 500 సంవత్సరాల నుంచి ఆకులవీధిలో రాజరాజేశ్వరిదేవి ఆలయం ఉందన్నారు. మట్లిరాజుల కాలంలో ఈ ఆలయాన్ని నిర్మించినట్టు ఇక్కడ లభించిన సమాచారాన్ని బట్టి తెలుస్తోందన్నారు. ప్రతి సంవత్సరంలాగే దేవదాయశాఖ పరిధిలో గల ఆలయాల్లో దసరా శరన్నవ రాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరగనున్నాయన్నారు. అమ్మవారిని దర్శించే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు గోపాలక్రిష్ణశర్మ, ఆలయ ఈవో శ్రీనివాసులు, ఇన్‌స్పెక్టర్ శివయ్య పాల్గొన్నారు.

22 నుంచి దేవునికడపలో..

తిరుమల తొలిగడపగా ఖ్యాతిగాంచిన దేవునికడపలోని శ్రీలక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 22వ తేదీ నుంచి అక్టోబరు రెండో తేదీ వరకు నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరగనున్నాయి. ప్రతి రోజూ ఉదయం 11 గంటల నుంచి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. అలాగే ప్రతిరోజూ సాయంత్రం 7గంటలకు వాహన సేవలు ఉంటాయి.

గండికోటకు మళ్లీ కృష్ణాజలాలు

కొండాపురం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టుకు అవుకు రిజర్వాయర్ నుంచి మళ్లీ కృష్ణా జలాలు వస్తున్నాయని ఈఈ ఉమామాహేశ్వర్లు తెలి పారు. ఆదివారం కృష్ణాజలాలను నిలుపుదల చేయగా, మళ్లీ గురువారం 1500 క్యూసెక్కుల నీరు వస్తోం దన్నారు. అదేవిధంగా వాగులు, వంకలు, పెన్నా, చిత్రా వతి నదుల ద్వారా ప్రాజెక్టులోకి వచ్చే ఇన్‌ఫ్లో 300 క్యూసెక్కులు ఉందన్నారు. ప్రస్తుతం సీబీఆర్‌కు 1000 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల దృష్ట్యా మరో 20 క్యూసెక్కుల నీరు వదులుతున్నామన్నారు. గండికోట ప్రాజెక్టు పూర్తి నీటి సామర్థ్యం 26.85 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 26.411 టీఎంసీల నీటిమట్టం ఉందని ఈఈ తెలిపారు.

పాత సామాన్ల ముసుగులో విద్యుత్ మోటర్ల చోరీ.. దొంగ అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న రూరల్ సీఐ క్రిష్ణయ్య

గోపవరం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పాత సామాన్లు కొంటాం.. పాత సామాన్లకు చక్కెర ఇస్తాం... అంటూ విద్యుత్ మోటర్ల చోరీకి పాల్పడుతున్న ఓ వ్యక్తిని గురువారం పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక పోలీసుస్టేషనులో రూరల్ ఇన్‌స్పెక్టరు క్రిష్ణయ్య విలేకరుల సమావేశంలో వివరాలు తెలిపారు. నెల్లూరు జిల్లా ఆత్మకూరు మండలం ఎల్ఆర్‌పల్లెకు చెందిన పాశం రమేశ్ అనే వ్యక్తి పగటి పూట గ్రామాల్లో పాత సామాన్లు కొంటామంటూ సంచరిస్తూ రాత్రి పూట ఎవరూ లేని సమయంలో దొంగతనాలు చేసేవాడు. బద్వేలు, గోపవరం పరిసర ప్రాంతాలైన టి.సండ్రపల్లె, వనంపుల గ్రామాల్లో ఇటీవల విద్యుత్ మోటర్లు దొంగలించాడు. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం శ్రీనివాసపురం సమీపంలో హరిత హోటల్ వద్ద నిందితుని అరెస్టు చేసినట్లు తెలిపారు. అతని వద్ద నుంచి మూడు మోటారు బోర్లు, ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఇన్‌స్పెక్టరు తెలిపారు. దొంగను అరెస్టు చేయడంలో కృషి చేసిన సీఐ క్రిష్ణయ్య, ఎస్ఐ శ్రీకాంత్, సిబ్బందిని మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్ అభినందించారు.

పోలీసుల అదుపులో నకిలీ పోలీస్

లింగాల,సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): లింగాల-పులివెందుల మార్గమధ్యలో గురువారం పోలీస్ అంటూ వాహనదారులను ఆపి బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్న ఓ వ్యక్తిని లింగాల పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయంపై పులివెందుల రూరల్ సీఐ ఎస్వీ రమణ మాట్లాడుతూ దొరిగిల్లు గ్రామానికి చెందిన నగేష్ (రాము) అనే వ్యక్తి సీఐ, ఎస్ఐ అంటూ లింగాలలో వసూళ్లకు పాల్పడుతున్నాడని వాహనదారుల నుంచి ఫిర్యాదు రావడంతో అతన్ని అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నామని, ఆ సమయంలో అతడు మద్యం మత్తులో ఉన్నాడని పేర్కొన్నారు.

ప్రజా పోరాటాల యోధుడు సురవరం



సంస్మరణ సభలో మాట్లాడుతున్న తులసిరెడ్డి

కడప మారుతీనగర్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసం అలుపెరగని పోరాటం చేసిన యోధుడు సురవరం సుధాకర్‌రెడ్డి అని భారత మినిస్ట్రీ సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఈశ్వరయ్య, కాంగ్రెస్ అధికార ప్రతినిధి తులసిరెడ్డి కొనియాడారు. గురువారం సీపీఐ ఆధ్వర్యంలో వైఎస్ఆర్ ప్రెస్‌క్లబ్‌లో సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర అధ్యక్షతన సురవరం సంస్మరణ సభ నిర్వహించారు. సభకు ముఖ్యఅతిథిలుగా వారు హాజరై మాట్లాడారు. తెలంగాణలోని మహబూబ్‌నగర్ జిల్లా ఇటిక్యాలలో సురవరం పుట్టి పెరిగి కర్నూలులో చదువుకుంటూ ఏఐఎస్ఎఫ్‌లో తొలుత సభ్యుడిగా చేరారన్నారు. విద్యారంగ సమస్యలపై పలు పోరాటాలు చేసి తద్వారా ఏఐఎస్ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారన్నారు. అనంతరం కమ్యూనిస్టు పార్టీలో చేరి ప్రజల పక్షాన పలు పోరాటాలు చేశారన్నారు. దున్నేవాడికి భూమి ఇవ్వాలని, ఇంటి స్థలం, ఇంటితో పాటు మౌలిక సదుపాయాలు ప్రాథమిక హక్కుగా భావించి వాటి సాధన కోసం అలుపెరగని పోరాటం చేసిన పోరాట యోధుడు అన్నారు. సీపీఐ నాయకులు చంద్రశేఖర్, గుంటి వేణుగోపాల్, నాగసుబ్బారెడ్డి, రామయ్య, వెంకటశివ, బాదుల్లా, సుబ్రహ్మణ్యం, మద్దిలేటి, మల్లిఖార్జున, విజయలక్ష్మి, భాగ్యలక్ష్మి, లోక్‌సత్తా నేత శ్రీక్రిష్ణ పాల్గొన్నారు.

ఇద్దరు వ్యక్తులు అదృశ్యం

ప్రొద్దుటూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని వసంతపేట ఎస్‌బీఐ కాలనీలో నివశిస్తున్న ఇంద్రకంటి విజయలక్ష్మి(53) గురువారం ఉదయం ఇంట్లో నుంచి వెళ్లి సాయంత్రం వరకు తిరిగి రాలేదు. బంధువులు తెలిసిన వారి ఇళ్ల వద్ద వెతికినా కనబడలేదు. విజయలక్ష్మి కొందరి వద్ద అప్పులు చేసి... వారి ఒత్తిళ్లు తట్టుకోలేక ఇంటి నుంచి వెళ్లినట్లు కుమారుడు వినోద్ వెల్లడించారు. ఆ మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. అలాగే ప్రొద్దుటూరు పట్టణం ఆర్ట్స్ కాలేజీ రోడ్డుకు చెందిన రసూల్ (50) బుధవారం తెల్లవారు జాము నుంచి అదృశ్యమయ్యాడు. 16వ తేదీ భార్య భర్తల మధ్య గొడవలు జరిగాయి. దీంతో మనస్థాపం చెంది వెళ్లినట్లు డని అతని భార్య రషీదా పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

సంతృప్తికరస్థాయి సేవలందించాలి : ఎస్ఈ

చక్రాయపేట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సంస్థపై ప్రజల సంతృప్తికరస్థాయి పెంచే విధంగా సేవలు అందించాలని కడప జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎస్.రమణ సూచించారు. గురువారం మండలంలోని యర్రగుడిలోని 33/11 కెవి సబ్‌స్టేషన్‌ను, ట్రాన్స్‌ఫార్మర్లను, లైన్లను క్షేత్రస్థాయిలో తిరిగి పరిశీలించారు. అనంతరం సిబ్బందితో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ వినియోగదారుల విద్యుత్ సమస్యలపై వచ్చినపుడు క్షేత్ర స్థాయిలోని సిబ్బంది, అధికారులు వారితో మర్యాదపూర్వకంగా ప్రవర్తిస్తూ సావధానంగా విని పరిష్కరించాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు తగినన్ని అందుబాటులో ఉన్నాయని, అవసరమైన ప్రాంతాలలో ఏర్పాటు చేసి లోఓల్టేజీ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానమంత్రి సూర్యఘర్ ఉచిత విద్యుత్ పథకం కింద గృహాలకు సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటుపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అతి తక్కువ వడ్డీ రేటుతో బ్యాంకులు రుణాలు ఇస్తున్నాయని, రూ.98వేల వరకు సబ్సిడీ ప్రోత్సాహకాలను అందిస్తుందని తెలియజేయాలన్నారు. వినియోగదారులు అంతరాయాలు సహించే పరిస్థితిలో లేరని, ముందస్తు మరమ్మత్తులు చేపట్టాలన్నారు. అంతేకాకుండా విద్యుత్ చౌర్యం అరికట్టేందుకు విధిగా దాడులు నిర్వహించాలన్నారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రసాదరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్ఈ రమణ

విద్యుత్ షాక్‌కు గురై..పాడిగేదె, దూడ మృతి



రాజుపాలెం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో టంగుటూరు గ్రామంలో విద్యుత్ షాక్‌కు గురై పాడిగేదె, దూడ మృతి చెందింది. గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన గంగమ్మ అనే మహిళ ఐదేళ్ల క్రితం భర్త చనిపోవడంతో ఒక సెంటులో రేకుల ఇల్లు వేసి.. అందులోనే పాడిగేదెను పెట్టుకొని వచ్చే ఆదాయంతో జీవనం సాగిస్తోంది. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ఇంటికి లాగిన కరెంటు తీగ తెగి రేకుల షెడ్డు మీద పడడంతో విద్యుత్ పాసై ఈ ప్రమాదం జరిగింది. పాడిగేదెకు బీమా వర్తించని పశువుల అధికారులు తెలపడంతో ప్రభుత్వం ఆదుకోవాలని బాధితురాలు కోరుతున్నారు.

విద్యుత్ ఉద్యోగ, కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ధర్నా చేస్తున్న విద్యుత్ ఉద్యోగులు

కడప సెవెన్ రోడ్స్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ఉద్యోగులు, కార్మికుల న్యాయమైన సమస్యల పట్ల యాజమాన్యం తక్షణమే సానుకూలంగా స్పందించాలని విద్యుత్ ఉద్యోగుల జేఏసీ వైస్ ఛైర్మన్ బి.రామలింగారెడ్డి అన్నారు. గురువారం విద్యుత్ భవన్ వద్ద విద్యుత్ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. ఈ సందర్భంగా జేఏసీ జిల్లా కన్వీనర్ ఎంవీ చలపతి, జేఏసీ ఛైర్మన్ యూకే బర్నబాస్ మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ వైస్ ప్రెసిడెంట్, బ్రహ్మానందరెడ్డి, నాయకులు ఫయాజ్ బేగ్, మురళీమోహన్, ఎం.యావేట్, రామకృష్ణ లక్ష్మీనారాయణ, సుధాకర్, సత్యనారాయణశర్మ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ర్యాలీగా వస్తున్న మున్సిపల్ కార్మికులు

కడప ఎర్రముక్కపల్లె, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ కార్మికుల సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. గురువారం కడప నగరంలో మున్సిపల్ కార్మికులు టీడీపీజిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి నివాసం వద్దకు చేరుకొని ఆయనకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నగర అధ్యక్షుడు సుంకర రవి,వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీరామ్, సహాయ కార్యదర్శి ఇత్తడి ప్రకాష్ మాట్లాడుతూ ఈనెల 24 నుంచి నగర వ్యాప్తంగా పాదయాత్ర, 27న కార్పొరేషన్ వద్ద మహాధర్నా నిర్వహిస్తామని ప్రకటించారు. సమస్యలపై స్పందించిన టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి స్పందిస్తూ కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

టీడీపీ కార్యాలయంలో ప్రజాదర్బార్

పులివెందుల, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పులివెందులలోని టీడీపీ కార్యాలయంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మారెడ్డి రవీంద్రనాథరెడ్డి (బీటెక్ రవి) ప్రజాదర్బార్ నిర్వహించారు. గురువారం ఆయన పార్టీ కార్యాలయంలో ఉండి ప్రజల సమస్యలు ఉన్నారు. ప్రజలు వారి సమస్యలను బీటెక్ రవికి విన్నవించారు. తుంగభద్ర ప్రాజెక్టు హైలెవెల్ ప్రాజెక్టు కెనాల్ ఛైర్మన్ జోగిరెడ్డి, రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు ఉచిత ప్రమాద బీమా కల్పించాలి

పులివెందుల రూరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో చదువుతున్న అన్ని కులాల పేద విద్యార్థులకు ఉచిత ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని ఏపీ ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.కృష్ణమూర్తి విజ్ఞప్తి చేశారు. కాగా గురువారం తహసీల్దార్ నజీర్ అహ్మద్‌నుకలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎమ్మార్పీఎస్ నాయకులు అంజి, నాగరాజు, గంగులయ్య పాల్గొన్నారు.

22 నుంచి డిగ్రీ కళాశాలల నిరవధిక బంద్

కడప ఎడ్యుకేషన్,సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 22వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా డిగ్రీ కళాశాలలను నిరవధికంగా బంద్ చేయాలని నిర్ణయించినట్లు డిగ్రీ కళాశాల అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.వెంకట శ్రీను తెలిపారు. గురువారం రిజిస్ట్రార్‌కు సమ్మె నోటీసు సమర్పించారు.

పులివెందుల చీనీ వ్యాపారంపై కలెక్టర్ ఆరా

పులివెందుల, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పులివెందుల చీనీ వ్యాపారంపై కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆర్డీఓ చిన్నయ్యతో ఆరా తీశారు. గురువారం ఉదయం కలెక్టర్ ఆర్డీఓ చిన్నయ్యతో ఫోన్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. పులివెందుల చీనీ వ్యాపారంపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ ఉండాలన్నారు. అందుకు ఆర్డీఓ ప్రతిరోజు పర్యవేక్షణ సాగిస్తున్నామని సమాధానమిచ్చారు. రైతుల్లో ఎలాంటి అపోహలు లేకుండా చూడాల్సిన అవసరం ఉందని కలెక్టర్‌కు వివరించారు. ఈనాం వ్యాపారంపై రైతులకు పూర్తిస్థాయి అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆర్డీఓకు వివరించారు.

ప్రబలుతున్న వైరల్ ఫీవర్స్



చక్రాయపేట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సురభి పీహెచ్‌సీ పరిధిలో వైరల్ ఫీవర్స్‌తో మంచాన పడుతున్నారు. మండలంలోని చిలేకాంపల్లె, బురుజుపల్లె,మహదేవపల్లె, దేవరపల్లె, హరిజనవాడ తదితరప్రాంతాలలో వైరల్ ఫీవర్స్ ఎక్కువగా నమోదవుతున్నాయి. ప్రభుత్వ వైద్యశాలలు వెలవెలబోతుంటే ప్రైవేట్ వైద్యశాలలు కళకళలాడుతున్నాయి. ఎక్కడ చూసిన జ్వరాలతో మంచానపడుతున్నారు. రోగులంతా వేంపల్లె, రాయచోటి ప్రాంతాలకు వెళ్తున్నారు. పేద ప్రజలు సురభి వైద్యశాలలో ప్రజలు చికిత్సకోసం పడిగాపులు కాస్తున్నారు. ఈ విషయంపై సురభి వైద్యశాల డాక్టర్ శివప్రసాద్‌ను వివరణ అడుగగా మండలంలో విష జ్వరాలు ఉన్నాయన్నారు.

ఎయిడ్స్ నిర్మూలిద్దాం

వేంపల్లె, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ నిర్మూలనకు సమష్టి కృషి అవసరమని కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ ప్రాజెక్టు మేనేజర్ వలి తెలిపారు. వేంపల్లె జడ్పీ బాలుర హైస్కూల్లో గురువారం ఎయిడ్స్‌పై అవగాహన సమావేశం నిర్వహించారు. అనంతరం గోడపత్రాలు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం నాగమునెమ్మ, హైస్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పొంగి పొర్లిన వాగులు, వంకలు

నిండు కుండలా కొప్పోలి చెరువు ● ఉధృతంగా ప్రవహిస్తున్న పైడికాల్వ వంక, కమలాపురం వాగేరు వంక ● ఎస్.పాలగిరి క్రాస్ వద్ద మొగమోరు వంక ● శివాలపల్లె వద్ద జింకల వంక ● నీట మునిగిన వరి పైరు



వల్లూరు... ఉధృతంగా ప్రవహిస్తున్న పైడికాల్వ వంక

వల్లూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు కొప్పోలి చెరువు కళకళలాడుతోంది. చెరువు కింద దాదాపు 470 ఎకరాలకు పైగా ఆయకట్టు ఉందని దీని వల్ల రైతులు రెండు కార్లు పండించుకోవడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. అలాగే ఈ చెరువు నిండడం వల్ల దిగువపల్లె, కొప్పోలు పంచాయతీలతో పాటు చిన్ననాగిరెడ్డిపల్లె, బోరెడ్డిపల్లె గ్రామాలకు చెందిన రైతుల పొలాలకు కూడా నీరు సంమృద్ధిగా ఉంటుందని అన్నారు. కొన్నిరోజుల క్రితం ఎమ్మెల్యే క్రిష్ణచైతన్యరెడ్డి, పుత్తా నరసింహారెడ్డి ఆదేశాల మేరకు చెరువులో మట్టిని రైతులకు తోలారు. దీని వల్ల లోతు ఎక్కువగా ఉండడంతో నీరు సంమృద్ధిగా చేరిందని కొప్పోలు చెరువు ఆయకట్టు ఛైర్మన్ లక్ష్మీరెడ్డి తెలిపారు. కొప్పోలు చెరవు నిండుకుండలా ఉండడంతో ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పొంగి పొర్లుతున్న పైడికాల్వ వంక..: మండలపరిధిలోని పైడికాల్వ - కడప మార్గమధ్యంలో వంకలు పొంగుతున్నాయి. పైడికాల్వ వంక వల్ల దాదాపు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కడపకు రాలేకున్నారు. వంక పారుతుందంటే దాదాపు 60 కిమీ చుట్టూ తిరిగి వెళుతున్నామన్నారు. దీంతో విద్యార్థులు పాల వ్యాపారులకు అంటున్నారు. బ్రిడ్జినిర్మిస్తే తప్ప ఇబ్బందులు తీరవని ఆవేదవ్యక్తం చేస్తున్నారు.

కమలాపురం రూరల్..: నియోజకవర్గంలో రాత్రి కురిసిన భారీ వర్షానికి కొన్ని గ్రామాలకు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కమలాపురం-ఖాజీపేట మధ్య పాగేరు వంక ఉధృతంగా ప్రవహించడంతో దాదాపు 20 గ్రామాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అదే విధంగా గోపులాపురం, పాచికలపాడు మధ్య వంక పొర్లడంతో ఆ రెండు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఎర్రగుడిగ్రామం వద్ద వంక ఉప్పొంగడంతో రజకులకు సంబంధించిన బట్టలు, డ్రమ్ములు, సామగ్రి కొట్టుకుపోవడంతో వారు లబోదిబోమంటూ ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటున్నారు. అదే విధంగా పాగేరు వంక సమీపంలో ఉన్న లేటపల్లె గ్రామ పొలాల్లో వరదనీరు రావడంతో వరిపంట పూర్తిగా నీట మునిగింది. పంట కోతకు వచ్చే సమయంలో ఇలా జరిగిందే దేవుడా అంటూ తమ ఆవేదనను విలపించారు.

ఎర్రగుడిపాడు రజకులను ఆదుకుంటా : డిప్యూటీ తహసీల్దార్ జ్యోతి

ఎర్రగుడిపాడు గ్రామ సమీపంలోని వంక పొర్లి ప్రవహించడంతో అందులో ఉన్న రజకులకు సంబంధించిన సామగ్రి కొట్టుకుపోవడంతో తీవ్ర ఆందోళనకు గురై బాధపడుతున్న వారిని టీడీపీ మాజీ సర్పంచ్ రామక్రిష్టారెడ్డి ఆధ్వర్యంలో గురువారం తహసీల్దారు జ్యోతికి రజకుల సమస్యలను వివరించారు. వెంటనే ఆమె స్థానిక వీఆర్వోను గ్రామానికి పంపి పంట నష్టాన్ని, రజకుల ఇబ్బందులను తెలుసుకుని రిపోర్టు ఇవ్వాలని ఆదేశించారు. తహసీల్దారు కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దారుకు రజకులు వినతిపత్రాన్ని అందించారు.

వీరపునాయునిపల్లె..: మండలంలో బుధవారం అర్ధరాత్రి నుంచి గురువారం ఉదయం 7 గంటల వరకు మోస్తరు వర్షంకురిసింది. ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో వంకలు, వాగులు ప్రవహించాయి. లోతట్టు ఉన్నపంటల పొలాల్లో వర్షపు నీరు చేరి కుంటలాగా దర్శనమిస్తున్నాయి. ఎస్.పాలగిరి క్రాస్ వద్ద మొగమోరు వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది.

పెండిమర్రి...: మండల పరిధిలో కురిసిన భారీ వర్షానికి వాగులు,వంకలు పొర్లి పొంగాయి. చాలా గ్రామాల పరిధిలో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కోనాయపల్లె,ఏరాసుపల్లె గ్రామాల మధ్య ఇటీవల నిర్మించిన బ్రిడ్జి లోపభూయిష్టంగా ఉండటంతో వర్షపు నీరంతా గ్రామంలోకి రావడంతో గ్రామస్థులు ఏ ప్రమాదం ముంచుకొస్తుందనో తెల్లవారు జామున వరకు జాగారం చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాపోయారు.

చెన్నూరు...: రెండురోజులుగా కురుస్తున్న వర్షాలతో మండలంలోని శివాలపల్లె వద్ద గల జింకల వంక పొంగడంతో ఆ గ్రామప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలతో ఈ వంక పొంగడంతో ప్రజలు ఎక్కడివారు అక్కడే నిలిచిపోవాల్సి వచ్చింది. గురువారం సాయంత్రం వరకు వంక నీరు ఏ మాత్రం తగ్గలేదు. దీంతో శివాలపల్లె నుంచి చెన్నూరు వచ్చే ప్రజలు అటు గోటూరు మీదుగా తిరిగి చెన్నూరుకు రావడం జరిగింది. జింకల వంకపై హైలెవల్ కాజ్‌వే ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



కమలాపురం... లేటపల్లె వద్ద నీట మునిగిన వరి పొలాలను పరిశీలిస్తున్న అధికారులు



పాలగిరి క్రాస్ వద్ద ఉన్న మొగమోరు వాగు



కోనాయపల్లె గ్రామం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వంక



ఉధృతంగా ప్రవహిస్తున్న శివాలపల్లె జింకల వంక



పొంగి ప్రవహిస్తున్న పాగేరు వంక

'ముఖ్యమంత్రి తీరు అభ్యంతరకరం'

కడప సెవెన్ రోడ్స్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ చేస్తే కోట్లు పోసి సీట్లను కొని వైద్యులుగా ఎదిగిన డాక్టర్లు ప్రజా సేవ ఏం చేస్తారని, ముఖ్యమంత్రి తీరు తీవ్ర అభ్యంతరకరమని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఈశ్వరయ్య పేర్కొన్నారు. గురువారం నగరంలోని వైఎస్సార్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఈశ్వరయ్య మాట్లాడుతూ మోదీ మెప్పు పొందేందుకు చంద్రబాబు కుటిల ప్రయత్నాలను ఖండిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, నగర కార్యదర్శి వెంకటశివ పాల్గొన్నారు.

ఐటీఐ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

లింగాల,సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): లింగాల ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో నాలుగో విడత ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ప్రసన్నరాణి తెలిపారు. ఈనెల 27వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని,అభ్యర్థులు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయించుకొని ఈనెల 29వ తేదీ కళాశాలలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరుకావాలన్నారు.

ఈ నెల చివరికి పంట నమోదు పూర్తికావాలి

చెన్నూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా వరిసాగు చేపట్టిన రైతులతో ఈ నెల చివరి నాటికి పంట నమోదు పూర్తి కావాలని కడప సహాయ వ్యవసాయ సంచాలకురాలు జి.లక్ష్మీమాధవి అన్నారు. చెన్నూరు మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల్లో వ్యవసాయ సహాయకులుగా పనిచేస్తున్న వారితో గురువారం సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. యూరియా పంపిణీ విధానం, స్టాకు వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో ఏవో శ్రీదేవి పాల్గొన్నారు.

ఏపీజీఎల్ఐ సమస్యలు పరిష్కరించండి

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల ప్రభుత్వ సామూహిక జీవిత బీమా సమస్యలు పరిష్కరించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.శ్యాం సుందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో జీవిత బీమా సహాయ సంచాలకుడు రమేశ్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఖాదర్ బాష, కార్యదర్శులు సుబ్బారెడ్డి, నరసింహులు, కౌన్సిలర్లు రాజారావు, రామసుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రణభేరి జాతకు స్పందన

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఉద్యోగుల ఆగ్రహానికి గురికాక తప్పదని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు హెచ్చరించారు. ఉద్యోగ,ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన యూటీఎఫ్ రణభేరి ప్రచారజాత గురువారం సాయంత్రం కడపకు చేరుకుంది. ఆర్టీసీ బస్టాండ్ నుంచి బాలాజీనగర్ యూటీఎఫ్ భవన్ వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర,జిల్లా నాయకులు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

రైళ్లకు హాల్ట్ కల్పించాలి

కడప ఎర్రముక్కపల్లె, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కడప, కమలాపురం, ముద్దనూరు, కొండాపురం స్టేషన్లలో రైళ్ల నిలుపుదల కల్పించాలని వైసీపీ నాయకుడు సంబటూరు ప్రసాద్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం కడప రైల్వేస్టేషన్‌లో స్టేషన్ మేనేజర్‌కు ఆయన వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

బీఎస్సీనర్సింగ్ ఉద్యోగులకు పదోన్నతి కల్పించాలి

కడప కలెక్టరేట్,సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్య శాఖ రీజన్ పరిధిలో ఉద్యోగాలు చేసే బీఎస్సీ నర్సింగ్ ఉద్యోగులకు ట్యూటర్ పదోన్నతులను కల్పించాలని కడప మెడికల్ రీజన్ డైరెక్టర్ డాక్టర్ రామగిడ్డయ్యకు జిల్లా ఎన్జీవో సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసులు,నిత్య పూజయ్య, కార్యవర్గం విన్నంచారు.గురువారం పాతరిమ్స్‌లోని మెడికల్ ఆర్డీ కార్యాలయంలో ఆర్డీకి వినతిపత్రం అందజేశారు.జిల్లాఅధ్యక్షుడుశ్రీనివాసులు, నాయకులు పాల్గొన్నారు.

హక్కుల కోసం ఉద్యమానికి సిద్ధం

కడప ఎడ్యుకేషన్,సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ ఉపాధ్యాయుల ఆర్థిక హక్కుల కోసం రాష్ట్ర సంతులత ఉపాధ్యాయ సంఘం (ఎస్‌టీయూ) ఉద్యమానికి సిద్ధమని జిల్లా అధ్యక్షుడు ఇలియాస్ బాష తెలిపారు. గురువారం కడపనగరం ఎస్టీయు భవన్‌లోకడపరీజనల్ కన్వీనర్ అబ్దుల్ వాజిద్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనమాట్లాడారు. సమావేశంలో రాష్ట్ర మున్సిపల్ కన్వీనర్ రవిశంకర్‌రెడ్డి, చెన్నకేశ్వరరెడ్డి,జిల్లా నాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

వేంపల్లె, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ ఉపాధ్యాయులకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సంగమేశ్వరరెడ్డి డిమాండ్ చేశారు. వేంపల్లె ఎస్టీయు కార్యాలయంలో చక్రాయపేట, వేంపల్లె మండలాల ఎస్టీయు ఉపాధ్యాయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ నేతలు శివారెడ్డి,ప్రతాప్‌రెడ్డి, లక్ష్మీనరసింహ తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన స్వామిత్వ సర్వే పూర్తి చేయాలి

పులివెందుల రూరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్వామిత్వ సర్వేను త్వరితగతిన పూర్తిచేయాలని పులివెందుల ఆర్డీఓ చిన్నయ్య పేర్కొన్నారు. గురువారం ఆర్డీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లకు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆర్డీఓ చిన్నయ్య మాట్లాడుతూ స్వామిత్వ సర్వే త్వరితగతిన పూర్తిచేసేందుకు అవసరమైతే మరికొంతమంది సర్వేయర్లను, సిబ్బంది నియమిస్తామన్నారు. సర్వే పక్కాగా సాగాలని, ఎక్కడ ఎలాంటి అవకతవకలు లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

చెత్తకుప్పలు ఎక్కడా ఉండకూడదు

కడప ఎర్రముక్కపల్లె, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కడప కార్పొరేషన్ పరిధిలో ఎక్కడా చెత్తకుప్పలు కనిపించకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంహెచ్‌ఓ డాక్టర్ రమేశ్ స్పష్టం చేశారు.గురువారం ఆయన అమ్మవారిశాల,పెద్దదర్గా, నకాష్,అగాడి ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలోని 50 డివిజన్లలో చెత్త నిల్వలు లేకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. కాల్వల్లో వర్షపునీరు నిల్వ ఉండకుండా పారేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నీరు నిలిచే ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్ వేసి దోమల ఉత్పత్తిని అరికట్టాలని ఆయన సూచించారు. చెత్తను రోడ్లపై, కాల్వల్లో వేయకుండా ఇంటి వద్దకు వచ్చే వాహనాలకు అందించేలా ప్రజల్లోనూ అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నాగసుబ్బయ్య, పూజిత్‌రెడ్డి, సునీల్‌కుమార్, శ్రీనివాసులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పులివెందుల సమస్యలు జగన్ అసెంబ్లీలో చర్చించాలి

మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి



అసంపూర్తి ఇళ్లను పరిశీలిస్తున్న బీటెక్ రవి

పులివెందుల, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పులివెందులలో అనేక సమస్యలు ఉన్నాయని వాటిపై జగన్ అసెంబ్లీకి వెళ్లి చర్చించాలని మాజీ ఎమ్మెల్సీ పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి మారెడ్డి రవీంద్రనాథరెడ్డి (బీటెక్ రవి) పేర్కొన్నారు. గురువారం బీటెక్ రవి జగనన్న కాలనీని పరిశీలించారు. అసంపూర్తిగా ఉన్న ఇళ్లమధ్య కంపచెట్లు, పిచ్చిమొక్కలు మొలిచిన వాటిని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి జగన్ పులివెందులలో ఒక సెంటు విస్తీర్ణంలో పేదవారికి ఇళ్లు నిర్మించలేని దుస్థితిలో ఉండిపోయారన్నారు. దాదాపు 7వేల పైచిలుకు పక్కాగృహాలు వివిద దశల్లో ఆగిపోయాయన్నారు. పులివెందులలో మెడికల్ కళాశాలకు సంబంధించిన భవనాలు ఏవీ పూర్తికాలేదన్నారు. కానీ ఆసుపత్రికి సంబంధించిన భవనాలు చూపి వైసీపీ రాజకీయాలు చేయాలనుకుంటోందన్నారు. ఆసుపత్రికి,మెడికల్ కళాశాలకు ఏమిటి సంబంధమని ఆయన ప్రశ్నించారు. పులివెందులలో అనేక సమస్యలు ఉన్నాయన్నారు.ఈ కార్యక్రమంలో తుంగభద్ర ప్రాజెక్టు హైలెవెల్ కెనాల్ ఛైర్మన్ జోగిరెడ్డి, తొండూరు మాజీ మండల ఉపాధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, హజ్ కమిటీ డైరెక్టర్ మహబూబ్ బాష, వెంకటరామిరెడ్డి, శివమోహన్‌రెడ్డి, పులివెందుల మండల ఉపాధ్యక్షుడు విశ్వనాథరెడ్డి, గుణకనపల్లె అమర్, హౌసింగ్, ట్రాన్స్‌కో అధికారులు పాల్గొన్నారు.

పలు కుటుంబాలు టీడీపీలో చేరిక

పులివెందుల, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పులివెందుల పట్టణంలోని నగరిగుట్టకు చెందిన సాయికుమార్, శివకుమార్, సంతోష్ తదితరులు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మారెడ్డి రవీంద్రనాథరెడ్డి (బీటెక్ రవి) సమక్షంలో టీడీపీలో చేరారు. గురువారం సాయంత్రం నగరిగుట్టలో బీటెక్ రవి వీరికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి అందరికి పంచిపెట్టారు.ఈ కార్యక్రమంలో నాయకులు, మహబూబ్ బాష, వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అవును.. ఇవి కడప రోడ్లే..!

కడపనగరంలోని వరదకాలనీ, జర్నలిస్టు కాలనీ, రామాంజనేయపురం, ఆక్స్‌ఫర్డ్ కాలనీల్లోని వీధుల్లో వర్షం పడితే చాలు.. రోడ్లన్నీ బురదనీటితో గుంతలమయంగా మారిపోయాయి. ఎక్కడ గుంత ఉందో, ఎక్కడ బాగుందో కనబడక ఆయా వీధుల వాసులు బెంబేలెత్తిపోతున్నారు. మామూలుగానే ఆయా రోడ్లు గుంతలమయంగా మట్టిరోడ్లతో దర్శనమిస్తుంటాయి. ఇక వర్షం పడిందంటే ఆ గుంతల్లో నీరు నిలబడి పాదచారులకు, వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కొంతమంది వాహనదారులు ఆ రోడ్లలోనే బురదకు జారి పడి గాయాలపాలవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆయాగుంతలను పూడ్చించాలని స్థానికులు కోరుతున్నారు.

— స్టాఫ్‌ఫొటో గ్రాఫర్, ఆంధ్రజ్యోతి



జర్నలిస్టుకాలనీ రోడ్డు దుస్థితి



తటాకాన్ని తలపిస్తున్న వరదకాలనీలోని కూడలి



వరదకాలనీ రోడ్డు నీటిలో ద్విచక్రవాహనదారుడి పాట్లు

జగన్‌ను కలిసిన పాకా సురేశ్

కడప ఎర్రముక్కపల్లె, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పాకా సురేశ్‌కుమార్ గురువారం మర్యాదపూర్వకంగా తాడేపల్లె పార్టీ ఆఫీసులో కలిశారు.పార్టీ కార్యకర్తలతో కలిసి సమావేశమైన వారు పార్టీ విధానాలు, ప్రజాసేవ కార్యక్రమాలపై చర్చించారని పాకా సురేశ్ తెలిపారు. గరిష్ఠ నేతలతో సమన్వయం,రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల సంక్షేమ కార్యక్రమాలను మరింత బలోపేతం చేయడానికి సమావేశం నిర్వహించినట్లు చెప్పారు.



దంచికొట్టిన వాన


నీటమునిగిన జొన్న పంట

నీట మునిగిన పంట పొలాలు

● రాకపోకలు బంద్

రాజుపాలెం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): బుధవారం రాత్రి రాజుపాలెం మండలంలో 80.3 మి.మీ. వర్షపాతం నమోదు కావడంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. మడమ వంక ఉధృతితో గురువారం ఉదయం నుండి రాజుపాలెం-వెంగలాయపల్లె, రాజుపాలెం-టంగుటూరు, తొండలదిన్నె-టంగుటూరు గ్రామాల రాకపోకలు పూర్తిగా బంద్ అయ్యాయి. ఈ వంకకు ఇరువైపులా ఉన్న వరి, పత్తి, జొన్న పొలాలు నీట మునిగాయి. దీంతో అరకొర సాగు చేసిన పంటలు కూడా నీటమునగడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు పరిశీలించి మరో పంట సాగుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. గురువారం మధ్యాహ్నం కూడా దాదాపు గంటసేపు భారీ వర్షం కురిసింది.


వెంగలాయపల్లె వద్ద రాకపోకలు బంద్

● జమ్మలమడుగులో భారీ వర్షం

● పలు ప్రాంతాల్లో రోడ్లపై వర్షపునీరు

జమ్మలమడుగు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులో బుధవారం రాత్రి నుంచి గురువారం తెల్లవారుజాము వరకు భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాల్లో వర్షపునీరు నిలిచింది. పట్టణంలోని ఆర్డీవో కార్యాలయ ఆవరణంలో ఆర్టీసీ డిపో గ్యారేజీ, కన్నెలూరులోని ఎస్సీ కాలనీ, నాగులకట్ట వీధి చౌడేశ్వరీదేవాలయం పక్కన, బుడగజంగం కాలనీలో, రైల్వేస్టేషన్ సమీపాన, బైపాస్‌రోడ్డు సమీపాన, కల్వర్టుల కింద భారీగా వర్షంనీరు నిలిచింది. బైపాస్‌రోడ్డులో కల్వర్టుల కింద వర్షపునీరు అధికంగా ఉండడం వలన రోడ్డు కుంగిపోతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే మోరగుడిలోని చౌడేశ్వరీదేవి ఆలయం, చుట్టుపక్కల రోడ్డుపై భారీగా వర్షం నీరు నిలిచింది. డ్రైనేజీ కాలువలు పొంగి ప్రవహించడంతో మురుగునీరు రోడ్డుపై చేరింది. ప్రొద్దుటూరు రోడ్డులోని మున్సిపల్ కార్యాలయం పక్కన రోటరీ నగర్ ఇళ్ల చుట్టూ వర్షపునీరు నిలిచింది.


మోరగుడిలో రోడ్డు పొడవునా నిలిచిన వర్షపునీరు


రోటరీ నగర్‌లో ఇళ్లచుట్టూ భారీగా వర్షపునీరు

ఖాజీపేటలో 66 మి.మీ. వర్షపాతం

ఖాజీపేట, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఖాజీపేటలో గురువారం తెల్లవారుజామున 66 మి.మీ. వర్షపాతం నమోదైంది. దీంతో మండల పరిధిలోని లోతట్టు ప్రాంతాల్లోని వరి, ఉల్లిపంటలు నీట మునిగాయి. పలు గ్రామాల్లో రోడ్ల వెంబడి నీరు నిల్వ ఉండడంతో దోమలు ప్రబలుతాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.


నీట మునిగిన వరిపంట

జమ్మలమడుగు డివిజన్‌లో వర్షపాత వివరాలు

జమ్మలమడుగు రెవెన్యూ డివిజన్ పరిధిలో నమోదైన వర్షపాత వివరాలు. జమ్మలమడుగులో 30.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. అత్యధికంగా ఎర్రగుంట్లలో 132 మి.మీ, పెద్దముడియంలో 80.8, రాజుపాళెం 83.2, ప్రొద్దుటూరులో 120.2, ముద్దనూరు 43.2, దువ్వూరు 34.6, చాపాడు 8.6, కొండాపురం 3.8, మైలవరం 7.4 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

వర్షంతో వీధులు జలమయం

దువ్వూరు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండలం నీలాపురంలో గురువారం తెల్లవారుజామున పడిన వర్షంతో వీధుల్లో నీరు నిలిచింది. ఆయా ప్రాంతాల్లో ప్రజల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. 30.4 మి.మీ. వర్షపాతం నమోదైంది. నాలుగు రోజులుగా అడపా దడపా వర్షం పడుతుండడంతో కాలువలు, వంకల్లో నీటి ప్రవాహం పెరిగింది.

విరిగిపడ్డ విద్యుత్ స్తంభం

ముద్దనూరు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం వెనుక వీధిలో గురువారం తెల్లవారుజామున విద్యుత్ స్తంభం విరిగి పడింది. అయితే ఎటువంటి ప్రమాదం జరుగలేదు. తెల్లవారుజామున 3గంటల నుంచి భారీ వర్షం కురవడంతో ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వెనుక ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ నుంచి క్రిస్టియన్ లైన్‌కు ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభం విరిగి రోడ్డుకు అడ్డంగా పడింది. దళితవాడ ప్రాథమిక పాఠశాల ప్రధాన గేటుపై విద్యుత్ తీగలు పడ్డాయి. ఆ సమయంలో ఎవరూ సంచరించకపోవడంతో ఎటువంటి ప్రమాదం జరుగలేదు. సమాచారం అందిన వెంటనే ట్రాన్స్‌కో అధికారులు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. ఏఈ శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో యుద్ధప్రాతిపదిక చర్యలు చేపట్టారు.

జలమయమైన వీధులు

ఎర్రగుంట్ల, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్లలో గురువారం తెల్లవారుజాము నుంచి ఉదయం వరకు కుండపోత వర్షం కురిసింది. కేవలం నాలుగు గంటల్లో 132 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఆకాశానికి చిల్లులు పడ్డాయా అనే విధంగా భారీ వర్షం కురిసింది. గత ఐదేళ్లలో ఇది ఒక రికార్డు. ఈ భారీ వర్షంతో ఎర్రగుంట్లలో వీధులన్నీ జలమయమయ్యాయి. మోకాటి లోతు వీధుల్లోకి వర్షపునీరు రావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వినాయక నగర్, ప్రకాష్‌నగర్, శాంతినగర్, రాణివనంలోని వీధులు నిండిపోయాయి. చాలా చోట్ల ఇంట్లోకి నీరు రావడంతో నిత్యావసర సరుకులు, వస్తువులు తడిసి ముద్దయ్యాయి. ఎర్రగుంట్ల-పోట్లదుర్తి దారిలో భారీ వర్షానికి పొలాల్లోని నీరంతా ప్రధాన రహదారిపైకి రావడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ట్రాఫిక్ జామ్ అయింది. మాలపాడు-కలమల్ల మధ్యలో వంక ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలు స్తంభించిపోయాయి.


ఇంటిలోకి వర్షపునీరు రావడంతో తడిచిన సరుకులు

దరఖాస్తుల ఆహ్వానం

పోరుమామిళ్ల, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ఖాళీగా ఉన్న హిస్టరీ లెక్చరర్ పోస్టుకు అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ శ్యామ్యుల్ డేవిడ్‌రాజ్ తెలిపారు. అభ్యర్థులు పీజీలో 55 మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలని, కంప్యూటరు పరివిజ్ఞానం తప్పనిసరి అన్నారు. పీహెచ్‌డీ చేసిన వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. అర్హులైనవారు ఈనెల 22వ తేదీన ఉదయం 10గంటలకు ఇంటర్వ్యూలకు హాజరు కావాలని ఆయన తెలిపారు.

నేడు మెగా జాబ్‌మేళా

జమ్మలమడుగు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సాయి పరమేశ్వర డిగ్రీ కళాశాల ప్రాంగణంలో శుక్రవారం నిర్వహిస్తున్న మెగా జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని కళాశాల కరస్పాండెంట్ పి. నాగేశ్వరరెడ్డి తెలిపారు. గురువారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జాబ్‌మేళాకు 12 ప్రముఖ కంపెనీల ప్రతినిధులు పాల్గొంటున్నారని, 10వ తరగతి, డిగ్రీ అర్హత కలిగి ఆసక్తి గలవారు జాబ్‌మేళాలో పాల్గొనాలన్నారు.

వాటర్ ప్లాంట్లలో మోతాదులో క్లోరిన్ వేయాలి

బద్వేలు, సెప్టెంబర్ 18(ఆంధ్రజ్యోతి): వాటర్ ప్లాంట్లలో తగిన మోతాదులో క్లోరిన్ వేయాలని మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి అన్నారు. గురువారం ఆయన మున్సిపాలిటీ పరిధిలోని పలు వాటర్ ప్లాంట్లను తనిఖీ చేశారు. క్వాలిటీ మెయిన్‌టెన్ చేయకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ మధ్యకాలంలో బద్వేలు, పరిసర ప్రాంతాలలో అధికంగా టైఫాయిడ్ కేసులు నమోదు అవుతున్నాయని, ప్రజలు కాచి చల్లార్చిన నీటిన తాగాలని సూచించారు.

స్వస్థనారీ సశక్త్ పరివార్ మహిళలకు వరం

● మండల వైద్యాధికారి ప్రశాంతి

కాశినాయన, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన స్వస్థనారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం మహిళలకు వరం లాంటిదని మండల వైద్యాధికారి డాక్టర్ ప్రశాంతి అన్నారు. గురువారం మండలంలోని ఇటుకులపాడు గ్రామంలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిరంలో స్వస్థనారీ సశక్త్ పరివార్ మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు హెచ్‌బి, ఆర్‌బీఎస్, బీపీ, నోటి, రొమ్ము క్యాన్సర్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో నిర్మల, సూపర్‌వైజర్ బాలయ్య, ఏఎన్‌ఎం ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాల ఆహ్వాన పత్రాల ఆవిష్కరణ

● ఏర్పాట్లు పూర్తి

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక పాత మార్కెట్‌లోని లలితాదేవి, రతనాల వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 22వ తేదీ నుంచి నిర్వహించనున్న దసరా ఉత్సవాలకు సంబంధించి ఆహ్వానపత్రాలను గురువారం ఆలయ ట్రస్టు కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఉత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి ప్రతిరోజు ప్రత్యేక అలంకరణలు, హోమాలు, వేదపారాయణం, యంత్ర ఆరాధనలను వేద పండితుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహిస్తామన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా నిర్వహిస్తాం : ఆర్యవైశ్య సభ

మైదుకూరు రూరల్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): మైదుకూరు పట్టణంలోని అమ్మవారిశాలలో దసరా పండుగను ఘనంగా నిర్వహిస్తున్నామని ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు బల్లాని చెన్నకేశవప్రసాద్ తెలిపారు. ఈ మేరకు స్థానిక అమ్మవారిశాలలో ఆర్యవైశ్య సభ పాలకవర్గం గురువారం శరన్నవరాత్రి మహోత్సవ ఆహ్వాన పత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 22వ తేదిన నుంచి అక్టోబరు 3వ తేదీ వరకు ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు, పారాయణాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య నూతన పాలక వర్గం తదితరులు ఉన్నారు.

ఐఎంఏ నూతన కార్యవర్గం ఎన్నిక


డాక్టర్ వినోద్ కుమార్‌రెడ్డి


డాక్టర్ వరుణ్ కుమార్‌రెడ్డి


డాక్టర్ సురేశ్ శ్రీనివాస్

ప్రొద్దుటూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు ఐఎంఏ (ఇండియన్ మెడికల్ అసోసియేషన్) నూతన కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. గురువారం స్థానిక జమ్మలమడుగు రోడ్డులోని ఐఎంఏ ఫంక్షన్ హాలులో జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఐఎంఏ ప్రొద్దుటూరు శాఖ అధ్యక్షుడిగా డాక్టర్ వినోద్‌కుమార్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి, కోశాధికారిగా డాక్టర్ సురేష్ శ్రీనివాస్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్యులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.

బద్వేలు అభివృద్ధి వీరారెడ్డి కుటుంబంతోనే సాధ్యం


రహంతుల్లాకు పుష్పగుచ్ఛం అందిస్తున్న టీడీపీ నేతలు

కలసపాడు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): బద్వేల్ అభివృద్ధి వీరారెడ్డి కుటుంబంతోనే సాధ్యమని రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ సాధనకారి రహంతుల్లా, నీటి సంఘం అధ్యక్షుడు చిన్నరంగారెడ్డి పేర్కొన్నారు. గురువారం తనను కలిసిన టీడీపీ కార్యకర్తలతో రహంతుల్లా మాట్లాడుతూ కష్టకాలంలో పార్టీని నమ్ముకొని పనిచేసిన ప్రతి కార్యకర్తకు టీడీపీలో న్యాయం జరుగుతుందన్నారు. రాష్ట్రాభివృద్ధికి చంద్రబాబు చేస్తున్న కృషికి మనం తోడుగా ఉందామని పిలుపునిచ్చారు. విజయమ్మ, రితేష్ ఆధ్వర్యంలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు అందరం కృషి చేయాలని సూచించారు. స్వామిరంగారెడ్డి, కాంట్రాక్టర్ శ్రీరాములు, డాక్టర్ సుభాష్‌చంద్ర తదితరులు రహంతుల్లాకు శుభాకాంక్షలు తెలిపారు.

స్వచ్ఛ ప్రొద్దుటూరు కోసం పాటు పడాలి



ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు

ప్రొద్దుటూరు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలంతా స్వచ్ఛ ప్రొద్దుటూరు కోసం పాటు పడాలని మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా గురువారం మున్సిపల్ సచివాలయ ఉద్యోగులు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రొద్దుటూరులో ప్లాస్టిక్ నిషేధం అక్టోబరు 2వ తేదీ నుండి సంపూర్ణంగా అమలు చేయబడుతుందన్నారు. వ్యాపారులు ప్రజలు స్వచ్ఛందంగా సహకరించాలన్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ప్లాస్టిక్ గ్లాసులు, బాటిళ్లు, కవర్లు వినియోగించరాదన్నారు. పట్టణంలో చెత్తను రోడ్లపైన, కాలువల్లో వేయకుండా మున్సిపాలిటీ సిబ్బందికి అందించి పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఈఈ శ్రీనివాసులు, డీఈ రాజేష్, ఆర్‌వో డేనియల్ జోసఫ్, ఏసీపీ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులు ఆత్మరక్షణ విద్యను నేర్చుకోవాలి

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థిని ఆత్మరక్షణ విద్యను నేర్చుకోవాల్సిన అవసరం ఎంతో ఉందని శక్తి టీం ఇన్‌చార్జి ఎస్‌ఐ కేపీజీ వెంకటరెడ్డి అన్నారు. శక్తి టీం ఆధ్వర్యంలో వైవీఎస్ మున్సిపల్ హైస్కూలులో విద్యార్థినులకు ఆత్మరక్షణ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మరక్షణ విద్యను నేర్చుకోవడం వలన విద్యార్థినులలో ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని, అలాగే క్లిష్టపరిస్థితుల్లో తమను తాము రక్షించుకోవడానికి ధైర్యాన్నిస్తుందన్నారు. ఈ శిక్షణ ప్రధాన ఉద్దేశ్యం భద్రత పట్ల విద్యార్థినులకు అవగాహన కల్పించడం, దాడులు జరిగిన సందర్భంలో వెంటనే ప్రతిస్పందన ఎలా ఉండాలో ప్రాక్టికల్‌గా శిక్షణ ఇస్తుమన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెడ్మాస్టర్ విజయభాస్కర్, శక్తి టీం సభ్యులు పాల్గొన్నారు.

కార్మికులకు వైద్య పరీక్షలు

ఎర్రగుంట్ల సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల ఆరోగ్యమే ప్రాధాన్యతగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించినట్లు కమిషనర్ శేషఫణి తెలిపారు. గురువారం అర్బన్ హెల్త్ సెంటర్లలో మున్సిపల్ కార్మికులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి, కూటమి ఇన్‌చార్జి మధుసూదనరెడ్డి మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు ఆరోగ్యంగా ఉంటేనే మున్సిపాలిటీ కూడా పరిశుభ్రంగా ఉంటుందన్నారు.

కొనసాగుతున్న ధర్నా

ఎర్రగుంట్ల సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల మండలం ఆర్టీపీపీలో ఉద్యోగ, కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలని విద్యుత్ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధర్నా గురువారానికి నాలుగో రోజుకు చేరింది. ఉదయం 8-30 గంటల నుంచి 9-30 వరకు పవర్ హౌస్ గేటు ముందు ధర్నా నిర్వహించారు. సమస్య పరిష్కరించేంత వరకు ఆందోళన చేస్తామని జేఏసీ నాయకులు అన్నారు. ఇంజనీర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని సంఘీభావం తెలిపారు.

చట్టబద్ధత కల్పించాలి

మైలవరం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ సమావేశంలో ఏబీసీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని, ఏబీసీ వర్గీకరణ అమలయ్యే వరకు ఎస్సీ ఉద్యోగ నియామకాలు ఆపాలని ఏపీఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు విజయకుమార్ మాదిగ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం తహసీల్దారు కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు బాలనారాయణ మాదిగ, చిన్ననరసింహులు మాదిగ, బాలనరసింహులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ అమలుకు వినతి

దువ్వూరు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు గురువారం తహసీల్దారు సంజీవరెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజు, ఓబులేసు, వెంకటనారాయణ పాల్గొన్నారు.

మండల అభివృద్ధే లక్ష్యం

బ్రహ్మంగారిమఠం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): బ్రహ్మంగారిమఠం మండల అభివృద్ధే ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ లక్ష్యమని టీడీపీ మండల అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి అన్నారు. గురువారం పల్లెపండుగలో భాగంగా కొత్తపల్లె గ్రామంలో సీసీరోడ్డు నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో డీఈఈ మధుసూదన్, ఏఈఈ మురళీధర్‌రెడ్డి, ఇంజనీరింగ్ అసిస్టెంటు వీరాస్వామి, సింగిల్‌విండో చైర్మన్ సాంబశివారెడ్డి, మేకల సుధాకర్, ప్రజలు పాల్గొన్నారు.

సొసైటీ అభివృద్ధికి కృషి చేయాలి

బ్రహ్మంగారిమఠం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమిరెడ్డిపల్లె ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సొసైటీ చైర్మన్ వెల్లటూరు సాంబశివారెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు చెన్నుపల్లె సుబ్బారెడ్డి కోరారు. గురువారం స్థానిక సొసైటీ కార్యాలయంలో నిర్వహించిన రైతుల సమావేశం వారు మాట్లాడారు. రాబోవు రోజుల్లో సొసైటీ ద్వారా ఎరువులను, అలాగే పంట రుణాలను అందిస్తామన్నారు. గతంలో తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి సంఘం అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో డైరెక్టర్లు చెవుల వెంకటేశ్వర్లు, చాపాటి సురేశ్‌కుమార్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

పోషకాహారం తీసుకోవాలి

మైదుకూరు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవాలని డీడీఎంహెచ్‌వో డాక్టర్ మల్లేష్ తెలిపారు. రాష్ట్రీయ పోషకాహార మాసోత్సవాల సందర్భంగా గురువారం ఐసీడీఎస్ సీడీపీవో శ్రీదేవి ఆధ్వర్యంలో క్రిష్ణాపురం యూపీఎంసీలో స్వస్తనారీ సశక్తిపరివార్ అభియాన్ మెడికల్ క్యాంపు నిర్వహించారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ప్రశాంతి, అంగన్వాడి కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

బ్రిడ్జిని వెంటనే నిర్మించాలి

అట్లూరు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): బద్వేలు-సిద్దవటం ప్రధాన రహదారిలో ఇటీవల వర్షాలకు కూలిపోయిన బ్రిడ్జిని వెంటనే నిర్మించాలని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు నాగదాసరి ఇమ్మానుయేలు డిమాండ్ చేశారు. గురువారం దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రతినిధుల బృందం పరిశీలించింది. బ్రిడ్జి కూలిపోయి నెలలు గడుస్తున్నా ఇటు అధికారులు, ప్రభుత్వం ముందుకు రాకపోవడం, ప్రయాణికులకు, వాహనదారులకు ఇబ్బందికరంగా మారిందని ఆరోపించారు. కార్యక్రమంలో దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి వెంకటరమణ, బ్రహ్మయ్య, శ్రీను, విలియం, ప్రసాద్, రామక్రిష్ణబాబు పాల్గొన్నారు.


కూలిన బ్రిడ్జిని పరిశీలిస్తున్న దళిత హక్కుల సంఘం ప్రతినిధులు

సమస్యల పట్ల ప్రభుత్వ వైఖరి సరి కాదు

● ఎస్టీయూ నాయకుల నిరసన

పోరుమామిళ్ల, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యల పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి సరికాదని ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి, రాష్ట్ర సీపీఎస్ కమిటీ కన్వీనరు సుబ్రమణ్యం అన్నారు. గురువారం సాయంత్రం పోరుమామిళ్లలోని ఎస్టీయూ భవన్‌లో రీజనల్ కన్వీనరు క్రిష్టారెడ్డి ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రస్తుత ప్రభుత్వ పెద్దలు ఇచ్చిన హామీలను అధికారంలో వచ్చాక ఏ మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. మధ్యంతర భృతిపై ప్రకటన కానీ, చర్యలు కానీ చేపట్టకపోవడం దారుణమన్నారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలలో ఈ దసరాకు కనీసం రెండు డీఏలైనా ప్రకటిస్తారని ఎదురుచూస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు చంద్రహాసరెడ్డి, బాలరాజు, చంద్రశేఖర్, వెంకట్రామయ్య, నారాయణరెడ్డి పాల్గొన్నారు. అలాగే యూటీఎఫ్ కార్యాలయంలో జిల్లా కార్యదర్శి కుర్ర చెన్నయ్య పాత్రికేయులతో మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు గడుస్తున్నా ఏ ఒక్క సమస్యకు చెప్పుకోదగ్గ పరిష్కారం కాలేదన్నారు. సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్‌గా మార్చేందుకు ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదన్నారు. నిరసన కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం నిర్వహిస్తున్న బైకు ర్యాలీని జయప్రదం చేయాలని కోరారు.

పెండింగ్ బకాయిలు చెల్లించాలి

జమ్మలమడుగు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ ఉపాధ్యాయుల పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ గురుకుమార్ డిమాండు చేశారు. ఈ మేరకు పట్టణంలోని పాత బస్టాండు గాంధీ విగ్రహం సమీపాన ఉన్న ఎస్టీయూ కార్యాలయం ఎదురుగా గురువారం సాయంత్రం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 11 నెలలుగా రిటైర్డు ఉపాధ్యాయులకు గ్రాడ్యుటీ చెల్లించలేదని, మూడు విడతల డీఏ త్వరగా చెల్లించాలని, 12వ పీఆర్‌సీ కమిటీ నియమించి సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్టీయూ ఉపాధ్యాయ నాయకులు ప్రసాద్‌బాబు, ఉపేంద్ర, శ్రీనివాసరెడ్డి, రామకృష్ణారెడ్డి, రాజశేఖర్, శివరాం, తదితరులు పాల్గొన్నారు.

వైద్య కళాశాలలను ప్రభుత్వమే నిర్వహించాలి

బద్వేలు, సెప్టెంబర్ 18(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో నిర్మించి నిర్మాణంలో ఉన్న 17 వైద్య కళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రైవేటు వారికి అప్పగించకుండా ప్రభుత్వమే నిర్వహించాలని సీపీఐ ఎంఎల్ జిల్లా స్టాండింగ్ కమిటీ మెంబర్ చంద్రశేఖర్ అన్నారు. గురువారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పీపీపీ విధానంలో మొదటి దశలో 10, రెండో దశలో మిగతా కళాశాలలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం దుర్మార్గమన్నారు. పులివెందుల, మార్కాపురం, మదనపల్లె, ఆదోని కళాశాలలకు మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ టెండర్లు పిలవడం విరమించుకోవాలన్నారు. విద్యను ప్రైవేటుపరం చేస్తే కూటమి ప్రభుత్వం పతనం తప్పదన్నారు. సమావేశంలో ఏబీవీపీ జిల్లా నాయకుడు అనిల్, ఏరియా నాయకులు శంకర్, చరణ్, బన్నీ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యశాలలో వైద్యం చేయించుకోవాలి : రితేష్‌రెడ్డి

బి.కోడూరు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ప్రతి ప్రభుత్వ వైద్యశాలలో అన్ని వసతులు ఉన్నాయని, వ్యాధిగ్రస్తులు ప్రభుత్వ వైద్యశాలలోనే వైద్యం చేయించుకోవాలని నియోజకవర్గ ఇన్‌చార్జి రితేష్‌రెడ్డి అన్నారు. గురువారం స్వస్థనారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రితేష్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి జబ్బుకు ప్రభుత్వ వైద్యశాలలో వైద్యం అందుతుందని, ఎలాంటి ఇబ్బందులు పడాల్సిన అవసరం లేదని, ప్రైవేటు హాస్పిటల్‌కు వెళ్లి లక్షలాది రూపాయలు పోగొట్టుకోకుండా ప్రభుత్వ వైద్యశాలకు వచ్చి వైద్యం చేయించుకోవాలన్నారు. అనంతరం వైద్యాధికారులు వినీత్‌కుమార్‌రాజు, ఉదయకిరణ్‌లను ప్రతిరోజూ ఓపీ ఎంత, వసతులు ఎలా ఉన్నాయి, ఎంతమంది గర్భిణులకు వైద్యం అందిస్తున్నారు వంటి విషయాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో కూటమి నాయకుడు బొజ్జ రోశన్న, సింగిల్‌విండో అధ్యక్షుడు గోడి భాస్కర్‌రెడ్డి, మార్కెట్‌యార్డు చైర్మన్ నారిశెట్టి సుప్రజ, బీజేపీ రాష్ట కార్యవర్గ సభ్యుడు రమణాచారి, రాష్ట్ర రైతు విభాగ అధ్యక్షుడు ఓ.రమణారెడ్డి, తహసీల్దారు దస్తగిరయ్య, ఎంపీడీవో మలీశ్వరి, డీఎంహెచ్‌వో నరసింహారెడ్డి, సీఐ క్రిష్ణయ్య, ఎస్‌ఐ వెంకటసురేశ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుగుణ, రామచంద్రారెడ్డి, అమర్‌నాథరెడ్డి, దుగ్గిరెడ్డి, రామ్మోహనరెడ్డి, శేషారెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, పవన్, సౌదరి సుబ్బారెడ్డి, మిషన్ దుగ్గిరెడ్డి, జడ్పీటీసీ దావీదు, రాఘవరెడ్డి, ఎంపీపీ కోడూరు చెన్నమ్మ, మండల వైస్ ప్రెసిడెంటు శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఉచిత వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న రితేష్‌రెడ్డి